మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శనివారం 11 - 04 - 2026 1

# 23 వరకు పోషణ పక్వాడ పిల్లలకు ఆరోగ్యకర భవిష్యత్తు కార్యక్రమం

## పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 23 వరకు నిర్వహించనున్న "8వ పోషణ పక్వాడ" కార్యక్రమం పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులతో కలిసి గురువారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల మొదటి 6 సంవత్సరాల జీవన విధానంలో సానుకూల మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గర్భధారణ నుంచి 2 సంవత్సరాల వరకు ఉ ండే తొలి 1000 రోజులు శిశువుల శారీరక, మానసిక అభివృద్ధికి అత్యంత కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం, సంరక్షణ అందించడం ద్వారా పిల్లల భవిష్యత్తును మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. కుటుంబాలు, సమాజంలో ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన పెంపు, చిన్నపిల్లల మెదడు అభివృద్ధికి అవసరమైన చర్యలపై దృష్టి సారించడం, అలాగే "జన్ ఆందోళన్" రూపంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలని ఆయన వివరించారు. ముఖ్యంగా ఈ ఏడాది పురుషుల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తల్లిదండ్రులిద్దరూ కలిసి పిల్లల సంరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. పోషణ పక్వాడలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. "సుపోషిత జనని-స్వస్థ శిశు" అనే అంశంపై తల్లి, శిశు పోషణపై అవగాహన కార్యక్రమాలు, తండ్రుల కోసం ప్రత్యేక వర్క్‌షాపులు, "సూపర్ డాడ్" రెసిపీ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా "జంక్ ఫుడ్ ఫ్రీ కమ్యూనిటీ" లక్ష్యంగా నుక్కడ్ నాటకాల ద్వారా ప్యాకెట్ ఆహారాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, "స్వాప్ ది స్నాక్" వంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను కూడా ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల కోసం "ఆటల ద్వారా నేర్చుకోవడం" కార్యక్రమాలు, "టాయ్-అ-థాన్" వంటి పోటీలు, "స్టోరీ టైమ్ విత్ పాపా" వంటి కార్యక్రమాలు పిల్లల మానసిక ఉత్తేజాన్ని పెంచేందుకు దోహదపడతాయని అన్నారు. పిల్లలలో స్క్రీన్ టైమ్ తగ్గించడం, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడం కోసం సమాజం నుంచి సహకారం అవసరమని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రత్యేక కార్యాచరణతో సంబంధిత అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో వుమెన్ & చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ పీడీ రామలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు

# గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** గర్భిణుల నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించాలని పోషణ జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు ఆయన ఛాంబరులో పోషణ పక్వాడ పక్షోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారం పుట్టబోయే ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, పోషకాహారంతోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుచేసారు. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే 'పోషణ పక్వాడ' కార్యక్రమం ద్వారా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి సరైన పోషకాహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు పోషకాహారంపై చైతన్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని అన్నారు. అనంతరం ప్రథమ స్వచ్ఛంద సంస్థ అందించిన జిల్లాలోని 84 హబ్ అంగన్వాడీ పాఠశాలలకు మెటీరియల్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పథక సంచాలకులు డా. టి.కనకదుర్గ, ప్రథమ స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త జీవిత, సీడీపీఓలు కె.విజయ్ గౌరి, జి.సుగుణ కుమారి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ వి.శ్రీనివాస్, తిరుపతి, డీసీపీఓ అల్లు సత్యనారాయణ,టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ కె.సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడి కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష : ఎస్పీ తుహిన్ సిన్హా



**చోడవరం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** భారీ స్థాయిలో అక్రమంగా గంజాయి అక్రమంగా తరలిస్తున్న నేరానికి అంతర్ జిల్లా ముఠా సభ్యులు ముగ్గురి కి ఒక్కొక్కరికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. హరి నారాయణ శుక్రవారం తీర్పు చెప్పారు . కేసుకు సంబంధించి అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా వివరాలు వెల్లడించారు . 2015 సంవత్సరం జనవరి 10న వి.మాడుగుల పోలీస్ సబిన్స్పెక్టర్ జి.తేజేశ్వరరావు సిబ్బందితో మండల పరిధిలోని ఘాట్ రోడ్ గరికబంద చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పాడేరు నుండి వస్తున్న ఏపి 9 హెచ్ 8169 నెంబర్ టాటా సుమో వాహనాన్ని తనిఖీ చేయగా 140 కిలోల గంజాయి ప్రస్సుడ్ ప్యాక్ లను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితులు వైఎస్ఆర్ కడప జిల్లా కు చెందిన పానుగంటి సుబ్బారావు, విశాఖపట్నం జిల్లా కేంద్రానికి చెందిన అల్లు సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండల వాసి అడిగర్ల సత్తిబాబు కలిసికట్టుగా అక్రమంగా గంజాయి తరలిస్తున్న నేరానికి ఎన్ డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి ఛార్జీ షీట్ దాఖలు చేశారు . ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చీపురుపల్లి సూర్య నారాయణ పోలీసులు సేకరించిన బలమైన సాక్ష్యాధారాలతో నిందితులపై మోపిన నేరాన్ని రుజువు చేసారు. దీంతో నిందితులు పాల్పడిన నేరానికి న్యాయమూర్తి పదేళ్ల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు . గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు శిక్ష పడేలా తగు సాక్ష్యాధారాలను సేకరించిన అప్పటి మాడుగుల ఎస్ఐ తేజేశ్వరరావు సిబ్బంది ని, ఏపీపీని ఎస్పీ తుహిన్ సిన్హా ఈ సందర్భంగా అభినందించారు .

# జలధారతో జలసిరులు..కార్యక్రమం అమల్లో జిల్లాను ఆదర్శంగా నిలపాలి : కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా జలసిరిని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో భూగర్భ జల మట్టాన్ని గణనీయంగా పెంచడం, గరిష్ట ఉపరితల నీటితో జలవనరులన్నీకలకలలాడేలా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జలధార కార్యక్రమానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, ఈ వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా పూర్తి చేయడం ద్వారా జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. జలవనరులు, డ్వామా, నీటిపారుదల శాఖల అధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఓలతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమన్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు.వివిధ శాఖల అధికారులు చేయాల్సిన విధులను కలెక్టర్ నిర్దేశించారు. జలధార-జలహారతి పనుల ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని చెప్పారు. అంచనా విలువ రూ.10లక్షలు లోపు పనులకు ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, పైబడిన పనులను ఇరిగేషన్ ఏఈలు మంజూరు చేస్తారని చెప్పారు. చెరువులు, సాగునీటి కాలువల్లో పూడిక తీయడం, గట్లను బలోపేతం చేయడం, క్యాచ్మెంట్ ప్రాంతం నుంచి నీరుపోయే మార్గాలను పునరుద్ధరించడం, అడ్డంకులను తొలగించడం, భూగర్భ జల మట్టాన్ని పెంచే కట్టడాల నిర్మాణం తదితర పనులను ప్రతిపాదించాలని సూచించారు. నదులు, చెరువుల్లోకి నీరు పోయే మార్గాల్లో ఉన్న అడ్డంకులను తొలగించడానికి ఎలాంటి చర్యలకైనా వెనుకాడవద్దని తాహశీల్దార్లను ఆదేశించారు. ముందుగానే గ్రామస్థాయిలో భూగర్భ జలాల మట్టాన్నినమోదు చేయాలని సూచించారు. చెరువులు, కాలువల పనులు మొదలుపెట్టకముందే ఫోటోలు తీసి ఉ ంచాలన్నారు.చివరి ఎకరం వరకు సాగు నీరందేలా, ఉపాధిహామీ పథకం ద్వారా తోటపల్లి కాలువలో వెంటనే పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల సుమారు 2.5 లక్షల మందికి లబ్దిచేకూరుతుందని చెప్పారు. అలాగే జిల్లాలో ఉ న్న 8059 చిన్ననీటి చెరువులతోపాటు, 7,162 పిఆర్ చెరువులన్నిటినీ పూడికతీసి, గట్లను బలోపేతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 98శాతం సన్న, చిన్నకార రైతులేనని, వారందరికీ సాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# పిఎండిఎస్ వ్యవసాయ పద్ధతులతో మేలు

### 30 రకాల విత్తనాలతో మెరుగైన పంట దిగుబడి : జిల్లా పకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్ లచ్చన్న

**రోలుగుంట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** పకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక పంట దిగుబడి సాదించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సి హెచ్.లచ్చన్న తెలిపారు. మండలం లోని శరభవరం, కోవ్వురు, రత్నంపేట గ్రామాలలో శుక్రవారం తనుజ బయో రిసోర్స్ సెంటర్ ఇన్పుట్, అవుట్ పుట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ పిఎం డిఎస్ 30 రకాల విత్తనాలు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ పిఎం డిఎస్ పద్ధతి తో భూమి లో నిరంతరం కప్పబడే ప్రక్రియకు శ్రీకారం చుట్టుకుంటుంది. అలాగే భూమి సారవంతంగా తయారవుతుంది. వివిధ పంటల వేర్లు భూమిలో వైవిధ్యత ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పరుస్తాయన్నారు. తద్వారా ప్రధాన పంటకు కావలసిన స్థూల మరియు



సూక్ష్మ పోషకాలు అందు బాటులోకి తీసుకువచ్చి మొక్కలు యొక్క వేరు వ్యవస్థను గ్రహింప చేస్తాయన్నారు. నేల గుల్ల భారీ వానపాములు వృద్ధి చెందుతాయి. నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పలు పంటల సాగువలన అదనపు ఆదాయం పెరుగుతుంది. నవధాన్యాల పంటల సాగువలన పశుపోషక విలువలతో కూడిన పచ్చిరొట్ట మేతగా ఉపయోగపడుతుంది. జీవవైవిధ్యత పెరుగుతుంది. నేలలో కార్బన్ శాతం పెరుగుతుంది.ప్రధాన పంటలో రసాయన ఎరువులు వినియోగం తగ్గుతుంది. ప్రధాన పంటలో దిగుబడులు పెరుగుతాయి. ప్రధాన పంటలో వాతావరణ వైపరీక్షత తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇచార్జ్ యర్రంశెట్టి నిర్మల, ఎం టి. వరలక్ష్మి, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ బొబ్బిలి సాంబమూర్తి, చందనాడ సాయి లక్ష్మి, కేసరపూడి శివ, యచలపు రాంబాబు, కె.నూకలమ్మ, వై పూర్ణిమ, వై .రాజు బాబు,నాగ కాంతమ్మ,శివ లలిత కుమారి,బి.స్వాతి, యు గింతాజిలి, దుర్గ, గంగా భవాని, సర్పంచ్ పంచాడ నాగ సూర్య చంద్ర, మాసాద రాజు,రోకల రాజు, భవాని,వెళ్లేటి చిన్నబ్బాయి, పంచాడ నాయుడు బాబు, నిద్ర రాజబాబు, మహిళా రైతులు, వివిఎ శివ గణేష్ పాల్గొన్నారు.

## కొమరవోలు గ్రామంలో పోషణ పఖ్వాడా కార్యక్రమం



**రోలుగుంట, ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో 8వ పోషణ పఖ్వాడా కార్యక్రమాన్ని స్థానిక సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నపిల్లల మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి అత్యంత కీలకమనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సహాయకులు పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సరైన ఆహార పద్ధతులు, పిల్లల బరువు--ఎత్తు పర్యవేక్షణ, హాయ్‌జీన్ అలవాట్లు వంటి అంశాలపై వివరించారు. అలాగే పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై శ్రద్ధ పెట్టేందుకు తల్లులను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ పోషణ కార్యక్రమాల గురించి సమాచారం అందించారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రశ్నలు అడిగి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, టీచర్స్ ఆయాలు,ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్లు ఎల్ ఎం అండ్ హెచ్ వో మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాబులును పరామర్శించిన వైసీపీ నాయకులు



**కొయ్యూరు , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** కొయ్యూరు మండల వైసీపీ పార్టీ మాజీ అధ్యక్షుడు జల్లి బాబులు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. అపెండిసైటిస్ సమస్యతో బాధపడుతున్న ఆయన నర్సీపట్నంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, మండల నాయకులు పాటి చంద్రశేఖర్,దేపూరి రాజబాబు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి బాబులును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాబులు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## యూజేఎఫ్ సేవలు అభినందనీయం

### శ్రీకాకుళం శాఖ కొత్త కార్యవర్గం ప్రకటన



**మల్కాపురం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ సామాజిక బాధ్యతగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షులు, సేల్స్ టాక్స్ అధికారి ఆర్. వేణుగోపాలరావు అన్నారు. గురువారం సాయంత్రం శ్రీకాకుళం ఎన్జీవో హోమ్ లో జరిగిన యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం వాణి వినిపిస్తున్న యూజేఎఫ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్. వర్మ మాట్లాడుతూ మేథావులు, నిపుణుల సూచనలు, సలహాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సమగ్ర నివేదికను సంబంధిత అధికారులు, రాజకీయ ప్రముఖులకు అందజేయడం జరిగిందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఈశ్వరరావు మాట్లాడుతూ యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీ స్థాయి లో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై గొంతు వినిపించిన సందర్భా లను గుర్తు చేశారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షునిగా చౌదరి సత్య నారాయణ. కార్యదర్శిగా బూడుమూరు శ్రీరాముల నాయుడు. కోశాధికారిగా సిపాన సూర్య ప్రకాష్ ఉపాధ్యక్షులుగా రమణమూర్తి. సహాయ కార్యదర్శిగా సూర్యారావు.ఈ కార్యక్రమం లో సీనియర్ జర్నలిస్ట్ ఎంవి. మల్లేశ్వరరావు, యూజేఎఫ్ ప్రతినిధులు రాము,డి. హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మతి స్థిమితం లేని మంత్రి వాఖ్యలు

### అచ్చెన్నాయుడూ..నోరు అదుపులో పెట్టుకో

**ఆముదాలవలన , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యల పట్ల మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమదాలవలస తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ఉనికి కోసం చనిపోయిన వ్యక్తిపై బురద చల్లడం అచ్చెన్నాయుడి దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు .వైఎస్సార్ మరణించిన సమయంలో జగన్మోహన్ రెడ్డి విదేశాల్లో ఉన్నారంటూ అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ,ఆనాడు తండ్రి మరణవార్త విని కుప్పకూలిపోయిన కుటుంబానికి జగన్ అండగా ఉండి,అంత్యక్రియల వరకు అన్ని తానై చూసుకున్న విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని, నీ రాజకీయ లబ్ధి కోసం ఇన్ని అబద్ధాలు ఆడతావా అని నిలదీశారు.మంత్రి అచ్చెన్నాయుడి విమర్శలకు కౌంటర్ ఇస్తూ,గార మండలం సింగపురం దగ్గర ఎర్రన్నాయుడుపై జరిగిన బాంబ్ బ్లాస్ట్ ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ సంచలన ప్రశ్నలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో



రణస్థలం మండలం వద్ద ఎర్రంనాయుడు వాహన ప్రమాదంలో మృతి చెందిన ఘటనలో నీ హస్తం లేదని చెప్పగలవా అంటూ తమ్మినేని ప్రశ్నించారు.వైఎస్సార్ పాదయాత్ర ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని,ఆయన ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్,ఉచిత విద్యుత్ వంటి పథకాలు తరాల జీవితాలను మార్చాయని గుర్తు చేస్తూ,అలాంటి మహనీయుడిపై విమర్శలు చేయడం ఆకాశంపై ఉమ్మి వేయడమేనని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో 'మావిగన్' ప్లాన్-బి కి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోందని,అమరావతిలో జరుగుతున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబు ఆదేశాలతో అచ్చెన్నాయుడు ఇటువంటి నీచమైన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.'అమరావతి వద్దు.. మావిగన్ ముద్దు' అని ప్రజలు అంటున్నారని,ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అచ్చెన్నాయుడు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తమ్మినేని సీతారాం ఘాటుగా హెచ్చరించారు.

# ఎన్టీఆర్ ఆసుపత్రిని పరిశీలించిన జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సంబాన

## వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు



**అనకావల్లి రూరల్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ సంబాన శ్రీనివాసరావు (డి సి హెచ్ ఎస్) ఎన్టీఆర్ ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలు, వార్డులు తిరిగి పరిశీలించారు. అత్యవసర విభాగంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను పరీక్షించి, ధైర్యం చెప్పారు. అందుతున్న సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులు అందించిన వివరాలు ప్రకారం వైద్యులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రోగుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ భాగంలో వైద్య ఆరోగ్య సేవలు కోసం వచ్చిన వారితో మాట్లాడారు. రోగులను తరలించే క్రమంలో నిర్లక్ష్యం చేశాడని ఫిర్యాదు రాగా వెంటనే స్పందించి 102 అంబులెన్స్ పైలెట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సృష్టి క్షేత్రం నిర్మాణానికి అడ్డంకులు తొలగాలి..శ్రీ దుర్గమల్లేశ్వరి ఆలయంలో విశేష పూజలు



**నర్సీపట్నం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద 'సృష్టి క్షేత్రం' పేరిట ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 108 అడుగుల శివపార్వతుల విగ్రహాల నిర్మాణానికి అడ్డంకులు తొలగాలని కోరుతూ శ్రీ దుర్గమల్లేశ్వరి స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహిం చారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సంకల్పంతో ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి ఎలాంటి విఘ్నాలు కలగ కూడదని ఆకాంక్షిస్తూ.. దేవస్థానం చైర్మన్ జంప నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా జరి పించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ జంప నాగరాజు మాట్లాడుతూ.. నర్సీపట్నంలో నిర్మిస్తున్న సృష్టి క్షేత్రానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్, వైఎస్సార్సీపీ నాయకులు దుష్ట శక్తుల్లా మారి అడ్డుత గులుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. 108 అడుగుల భారీ శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుతో ఈ ప్రాంతం మహోన్నత ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, పర్యాటక కేంద్రం గా కూడా విశేషంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల కాలంలో నూకాం బిక అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయలేక పోయారని, కానీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సంకల్పంతో కేవలం ఆరు నెలల్లోనే ఆ పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. సృష్టి క్షేత్రం వంటి పవిత్రమైన కార్యక్రమానికి ఉద్దేశ పూర్వకంగా సృష్టిస్తున్న అడ్డంకులు సత్వరమే తొలగి పోవాలన్న సదుద్దేశం తోనే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టీడీపీ నాయ కులు, ఆలయ కమిటీ సభ్యు లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రామాలయం కోసం తయారు చేయించిన వీణను పరిశీలించిన ఎమ్మెల్యే బేబీనాయన



**విజయనగరం జిల్లా / బొబ్బిలి , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** ప్రపంచ ప్రసిద్ధి చెందిన బొబ్బిలి వీణను అయోధ్య రామాలయానికి బహుమతిగా పంపించేందుకు శాసనసభ్యులు ఆర్.వీ .ఎస్.కె .కె.రంగారావు (బేబీ నాయన) గొల్లపల్లి వీణల తయారీ కేంద్రం లో ప్రముఖ వీణల కళాకారులు సర్వసిద్ధి గంగాధ రాచారిచే ప్రత్యేకంగా వీణను తయారు చేయించారు.. ఈరోజు గొల్లపల్లి గ్రామంలో సర్వసిద్ధి గంగాధ రాచారి స్వగృహమందు పూర్తి చేయబడిన వీణను చూసి, అద్భుతంగా తయారుచేశారంటూ వారిని అభినందించారు.

# న్యాయవాదులపై దాడులను ప్రభుత్వం అరికట్టాలి

## న్యాయవాదుల రక్షణ బిల్లు తీసుకురావాలి..విధులు బహిష్కరించి నిరసన చేసిన బార్ కౌన్సిల్ సభ్యులు



**అనకావల్లి రూరల్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** న్యాయవాదులపై జరుగుతున్న దాడులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకొని నివారించాలని బార్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. అనకాపల్లి కోర్టుల సముదాయ ప్రాంగణంలో శుక్రవారం బార్ కౌన్సిల్ కమిటీ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లి బార్ అసోసియే షన్ అధ్యక్షుడు వద్దాది వెంకట్రావు, మాజీ అధ్యక్షుడు పిళ్ళా హరశ్రీనివాస రావుల అధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి స్థానిక కోర్టు సముదాయముల ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోర్టు సమూదాయ ప్రాంగణంలో న్యాయవాదులందరూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, న్యాయవాదుల రక్షణ బిల్లు తీసుకు రావాలని పెద్ద పెట్టున నినాదాలు చేశా రు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వద్దాది వెంకట్రావు మాట్లా డుతూ, రాష్ట్రంలో, దేశంలో న్యాయ వాదులపై దాడులు రాను రాను పెరుగు తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి నిబద్ధతకు కట్టుబడి తమ వద్దకు వచ్చిన కక్షిదారులకు న్యాయం చేయడానికి న్యాయవాదులు కృషి చేయడం వృత్తి ధర్మం అన్నారు. రాలేదు నాకు రాజ్యాంగం ప్రకారం న్యాయ వాదులు అందించే సేవలు న్యాయ వ్యవస్థలో అంతర్భాగమని ఆయన పేర్కొ న్నారు. అటువంటి వారిపై దాడు లు చేయడం అన్యాయమని అన్నారు. మాజీ అధ్యక్షుడు పిళ్ళా హర శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదులు తాము చేపట్టిన కేసు గెలవడానికి తన శక్తి, యుక్తులను దారపోసి శక్తివంచన లేకుండా కృషి చేస్తారని, అందులో ఒక పార్టీ గెలిస్తే మరో పార్టీ ఓడిపోవడం సర్వసాధారణమన్నారు. తీర్పులో ఓడిపోయిన వారందరూ గెలిచిన పార్టీ న్యాయవాదులను చంపుకుంటూ పోతే దేశంలో న్యాయవాదులు మిగలరని రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇవాళ న్యాయవాదులపై జరుగుతున్న దాడులు రానున్న రోజులలో న్యాయమూర్తులకు కూడా విస్తరిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై దాడిని న్యాయ వ్యవస్థపై దాడిగా గుర్తించాలని ఆయన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శివాచారి, కే. పి. వి రమణయ్య, మజ్జి శ్రీనివాసరావు, రాపేటి గోవిందరాజు మాట్లాడుతూ, ఒక సాధారణ వ్యక్తిపై జరిగే దాడిని, ఒక న్యాయవాదిపై కక్ష కట్టి చేసే దాడిని ఒకే విధంగా చూడరాదని, న్యాయవాదులపై జరిగిన దాడులను ప్రత్యేకంగా నమోదు చేసి, విచారించి, కఠిన శిక్షలు విధించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మళ్లీ అదే అంశాన్ని మళ్లీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామని వారు గుర్తు చేశారు. ఇందుకోసం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక ముసాయిదా "న్యాయవాదుల రక్షణ బిల్లును" తయారుచేసి కేంద్రానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించిందని దక్షిణ భారతదేశంలో కర్ణాటక రాష్ట్రం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఉదహరించారు. కర్ణాటక రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించాలని వారు కోరారు. న్యాయవాదులపై దాడులు జరిగే సందర్భంలో వారికి రక్షణకల్పించడంతోపాటు, సంక్షేమ, ఆర్థిక చర్యలు కూడా ఆ చట్టంలో భాగంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసురేష్ కుమార్, పీలా మోహనరావ్, పెంటకోట మోహన్, మల్లేశ్వరరావు, నాగులపల్లి రామక్రిష్ణ, యల్లపు రామకృష్ణ, కోయిలాడ గంగాధర్, బుద్ధ ప్రభాకర్, ఆర్ డి ప్రసాద్, దివాకర్, అయితా సన్యాసిరావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# అపోహలను వీడి రక్తదానంకు ముందుకు రావాలి : కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** రక్తదానం మహాదానమని, రక్తదానం పట్ల ఉన్న అపోహలను వీడి, ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి యువత, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మనం ఇచ్చే రక్తం మరొకరికి పునర్జన్మను ప్రసాదిస్తుందని గుర్తుచేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రక్తదాతలను పలకరించి, వారిని ఉత్సాహపరిచారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సర్వే, రెవిన్యూ మరియు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఒకరి ప్రాణాన్ని కాపాడేందుకు రక్తం ఇవ్వడం అత్యంత గొప్ప సేవా కార్యక్రమమని ఆయన కొనియాడారు. అనంతరం దాతలకు అయన పండ్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం విధులకు పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మన్యం హెల్పింగ్ హాండ్స్ వంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని, సామాజిక స్పృహతో ముందుకు సాగాలని అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. జి.నాగభూషణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, జిల్లా సర్వే మరియు భూరికార్డుల అధికారి ఎం.శ్రీనివాస రావు, రెవిన్యూ, వివిధ శాఖల అధికారులు, ఎన్జీఓ అసోసియేషన్ల ప్రతినిధులు, వైద్య సిబ్బంది, రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జీవో నెం.3 సాధనకు 12 న జరిగే సదస్సును జయప్రదం చేయండి

**జియ్యమ్మవలస , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** జీవో నెం.3 సాధనకు 12న రంపచోడవరంలో జరిగే సదస్సు కు పెద్ద ఎత్తున గిరిజన యువత ఉపాధ్యాయులు గిరిజన నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్. శ్రీరాములు, కూర్మారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ .గంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కురుపాం మండల కేంద్రంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జీవో నెం.3కు ప్రత్యామ్నాయం తీసుకువస్తామని, గిరిజన అభ్యర్థులకు న్యాయం చేసేలా ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చిందని అయితే అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ హామీలపై ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రత్యేక డీఎస్సీ లేకపోవడంతో గిరిజన యువత ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే అనేక మంది నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. జీవో నెం.3 పరిరక్షణతో పాటు సిఆర్‌టీలకు, భాషా వాలంటీర్లకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు అన్నిటిపై చర్చించేందుకే రంపచోడవరంలో సదస్సును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభాస్, సాయి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో రాత్రి వేళలో గస్తీ ముమ్మరం చేయాలి : ఎస్పీ తుహిన్సిన్హా



**రావికమతం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** పాఠశాలల వేసవి సెలవులకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రుల తో కలిసి ఇళ్ళకు తాళాలు పెట్టి ఇతర ప్రాంతా లకు వెళ్లే అవకాశం ఉన్నందున రాత్రి వేళలో గస్తీని ముమ్మరం చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. మండలంలో కొత్తకోట సర్కిల్ కార్యాలయం పోలీస్ స్టేషన్ ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, వివరాలపై ఆరా తీశారు. గంజాయి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, సిబ్బందికి సూచించారు. వాహనదారులుకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే '1930' నెంబర్‌కు ఫిర్యాదు చేసేలా చైతన్యవంతులను చేయాలన్నారు. మహిళలు, బాలికల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, 'శక్తి' యాప్ పై మహిళలకు అవగాహన కల్పించా లన్నారు .నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ని దర్శించుకున్న ఎండోమెంట్ స్టేట్ కమిషనర్ కే. రామచంద్ర మోహన్

### అమ్మవారి కి పట్టువస్త్రాలు సమర్పించిన కమిషనర్ రామచంద్ర మోహన్ దంపతులు

**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ని శుక్రవారం ఎండోమెంట్ స్టేట్ కమిషనర్ కే. రామచంద్ర మోహన్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందు గా అమ్మవారి కి వారు పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు మంగళ వాయిద్యాలు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో ఎండోమెంట్ స్టేట్ కమిషనర్ రామచంద్ర మెహన్ దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తదితరులు వారికి శాలువాలు కప్పి,కలియుగ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. తదనంతరం ఎండోమెంట్ స్టేట్





కమిషనర్ రామచంద్ర మోహన్ కి అమ్మవారి జాతర ఏర్పాట్లు, దేవాలయ అభివృద్ధి గురించి శాసనసభ్యులు రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు), దేవదాయ ధర్మదాయ సహా కమిషనర్, దేవస్థాన ఈఓ యాళ్ళ శ్రీధర్, దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్ సుజాత, జిల్లా ఆధికారి సుధారాణి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటోలకు స్థలం లేదు..ట్రాఫిక్‌కు అడ్డుకట్ట లేదు



- పార్కింగ్ లేక ఇబ్బందులు.. చర్యలు కోరిన ఆటో యూనియన్
- రోడ్డుపై దుకాణాలు.. ఆటోలకు నరకం
- ట్రాఫిక్ కష్టాలు : ఆటో డ్రైవర్ల ఆవేదన
- ఆటోలకు పార్కింగ్ కేటాయించాలి

**హుకుంపేట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆటో యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు కనీస సదుపా యాలు కల్పించాలని కోరుతూ మండల తహసీల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, పంచాయితీ సచివాలయం అధికారులకు మెమొరాండం సమర్పించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు పూర్వపు నాయకుడు టి.కృష్ణరావు, ప్రస్తుత అధ్యక్షుడు కె.సూరి, కార్యదర్శి డి.మధు, నాయకులు కె.గోవింద్‌లు శుక్రవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. మండలంలో సుమారు 150 నుంచి 200 మంది ఆదివాసి నిరుద్యోగులు ఆటోల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించాల్సి ఉన్నప్పటికీ, ఐటిడిఏ లేదా ప్రభుత్వం దృష్టి సారించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి జీవనోపాధి కొనసాగిస్తున్నామని చెప్పారు. మండల కేంద్రంలో ఆటోలకు పార్కింగ్ స్థలం లేకపోవడం,సీరియల్ పాయింట్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే పార్కింగ్ స్థలం, సీరియల్ పాయింట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇక ప్రధాన రహదారిపై దుకాణాలు ఇరువైపులా సరుకులు పేర్చి వ్యాపారం చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. ఆటోలు ప్రయాణికులను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు పోలీసులు డ్రైవర్లపైనే చర్యలు తీసుకుంటున్నారని, కానీ రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వెంటనే రోడ్డుపై ఉన్న దుకాణాలను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రిం చాలని యూనియన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

**- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి**



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తుందని పార్వతీపురం ఐటీడీఏ ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని గిరిమిత్ర హాల్‌లో నిర్వహించిన గిరిజన సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ఏడుగురు గిరిజనుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రహదారులు, సామాజిక ఆరోగ్య సిబ్బంది, రుణాలు మంజూరు కోరుతూ దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అధికారులు స్వయంగా సందర్శించి చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంలో అలసత్వం వహించకూడదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనా అధికారులు, వివిధ శాఖల సమన్వయకర్తలు మరియు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులకు, ఐటిడిఎ అంబులెన్స్ డ్రైవర్స్ కు

# కనీస వేతనాల కార్మిక చట్టాలు అమలు చేయాలి : ఎఐటియుసి డిమాండ్

**పాడేరు టౌన్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అల్లూరి సీతారామ జిల్లా పాడేరు కేంద్రం లో ఐటీడీఏ వద్ద ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో కార్మికుల కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఎ అంబులెన్స్ డ్రైవర్స్ మరియు పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం స్పందన లో కలెక్టర్ కి వినతి అందచేశారు. ఈ కార్యక్రమం లో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు అమర్,జల్లి రాజుబాబు లు పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో గ్రామపంచాయతీ అండ్ స్వచ్ఛభారత్ వర్కర్స్ అల్లూరి జిల్లాలో ఉన్నటువంటి గ్రామ పంచాయతీ లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల చాలా తీవ్రమైన మని అల్లూరి జిల్లా అన్ని మండలాల్లో ఉన్న గ్రామ పంచాయితీలలో అనేక సంవత్సరాల నుండి పారిశుద్ధ్యం,ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లై మరియు డ్రైవర్లుగా స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న వారి బ్రతుకులలో మాత్రం మార్పు లేదని వారికి కనీసం కార్మిక చట్టాలు ఈ.ఎస్.ఐ., పీ.ఎఫ్. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు కావటం లేదని, అన్నారు. శ్రమకు మించి పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని కరోనా లాంటి విపత్కారమైన సమయం లో సైతం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కుటుంబం సభ్యులను విడిచిపెట్టి రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలు ఆరోగ్యం మా ఆరోగ్యం అని సేవ చేసినా సరే కనీసం కనికరం చూపటం లేదని మా జీతాలయిన పెంచిన దాఖాలు లేవని, వివిధ పంచాయతీలలో కార్మికుల జీతాలు అధికారులు దయా దక్షిణాలపై ఆధారపడి ఎప్పుడో ఇస్తే అప్పుడు అది కూడా ఎంత ఇస్తే ఎంత తీసుకోవాల్సి నటువంటి పరిస్థితి ఉన్నదని,అన్నారు. పని చేస్తున్న అధికారులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు కనీసం మాపై మానవత్వం చూపటం కొరవైందని ,అత్యంత దుర్మార్గం స్వచ్ఛభారత్ కార్మికులు క్లాప్ మిత్ర వారికి నెలలుతరబడి జీతాలు రాక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని అనేక ఇబ్బందులు పడుతున్నామని,పని భారం




పెరిగిందని జీతాలు జీతాలు పెంచమని అడిగితే ఇష్టమైతే ఉండండి కష్టమైతే మానేయండి కిందిస్థాయి అధికారుల తేల్చి చెపుతున్నారని,అన్నారు. ఇదే వృత్తిని నమ్ముకుని బతుకుతున్న మా కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభ కు గురవుతున్నామని ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు వీధులు, కాల్వలు శుభ్రం చేయడమే, కాకుండా అనేక రకాల పనులకు మమ్మల్ని ఉపయోగిస్తున్నా మా కార్మికులకు జీతాలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని గతంలో కలెక్టర్ ఆఫీసు నుండి ఉత్తర్వులు జారీ చేసినా, అధికారులు అమలు చేయలేదని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 6000 రూపాయలు నుండి పదివేల రూపాయలు జీతం పెంచుతూ 680 జీ.వో.ను విడుదల చేసినప్పటికి నేటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయవలసిన జిల్లా అధికార యంత్రాంగం గ్రామపంచాయతీ స్వచ్ఛభారత్ కార్మికులు కష్టాలు కనబడకపోవడం కనీసం రెండు జతలు బట్టలు చెప్పులు, గ్లౌజులు కార్మికులకు ఇవ్వకపోవడం వల్ల తరచూ అనారోగ్యం పాలై అనేకమంది మృతి చెందినటువంటి సందర్భం కూడా మన జిల్లాలో ఉన్నదనీ అన్నారు. మా డిమాండ్స్ అయిన పంచాయితీ కార్మికులు ప్రభుత్వం జీవో 680 ను అమలుపరచి పదివేల జీతం ఇవ్వాలనీ,డి.పి.ఓ. ద్వారా కాని ఎం.పి.డి.వో. ద్వారా కాని గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని అన్నారు. ప్రమాదం ద్వారా లేదా సహజ మరణం పొందిన కార్మికులకు మట్టి ఖర్చులు యిచ్చి వారి కుటుంబం లో ఒక్కరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని మేజర్ పంచాయితీ లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలు అములు చేసి పిఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. అలానే జిల్లా పారిశుధ్య కార్మికుల యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ పంచాయతీలో జరుగుతున్న టెండర్లకు కార్మికులకు అవకాశం కల్పించాలని పంచాయతీల్లో పెరుగుతున్న జనాభా గ్రామాలు ప్రాతిపదికన కార్మికులను నియమించాలని, కార్మికులకు మాస్కులు, గౌజులు, శానిటైజర్లు , బూట్లు తో పాటు నూనెలు, బట్టలు, సబ్బులు, పప్పు దినుసులు యివ్వాలని డిమాండ్ చేశారు. అలానే ప్రభుత్వమే పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ ద్వారా జీతాలు ఇవ్వాలిని,కోరుతున్నామని అన్నారు. పంచాయితీలలో ఉన్న పరిశుద్య కర్మికుల సమస్యలను బకాయి జీతాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మా యొక్క సమస్యలు మరియు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే మా సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. అలానే ఐటిడిఎ ఆదివాసి అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్( ఎఐటియుసి అనుబంధం)యూనియన్ అధ్యక్షులు వంతల కృష్ణ మాట్లాడుతూ ఐటిడిఎ ల పరిధిలో ఉన్న పీహెచ్ సి ,ఏ హెచ్ సి ,సి హెచ్ సి , జిల్లా ఆసుపత్రి లలో గల అంబులెన్స్ ల నందు డ్రైవర్స్ గా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. డ్రైవర్స్ కు పి.ఎఫ్. మరియు ఈ.ఎస్. ఐ లను అమలు చేయాలని, సెలవు దినాలు అమలు చేయాలని,24ఐ7 గా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్స్ కు బప్పర్ డ్రైవర్స్ ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. 108 డ్రైవర్స్ మాదిరిగా ఐటిడిఎ అంబులెన్స్ డ్రైవర్స్ కు కూడా 28500/- జీతం అమలు చేయాలని,ఎఫ్ ఆర్ ఎస్ నుండి అంబులెన్స్ డ్రైవర్స్ కు మినహాయించాలని అలానే మరి ముఖ్యంగా ఏళ్ళ తరబడి ఐటిడిఎ అంబులెన్స్ డ్రైవర్స్ గా విధులు నిర్వహిస్తున్న వారిని కూడా హైకోర్టు ఆదేశాలు ప్రకారం శాశ్వత ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మినెంట్ చేయాలని అన్నారు. అలానే షిఫ్ట్ డ్యూటీ లను అమలు చేయాలని కోరారు. అలానే అనుకోని సందర్భాలలో ప్రమాదాలకు గురైన డ్రైవర్స్ కు నష్ట పరిహారం ఐటిడిఎ అందించాలని అలానే తదితర డిమాండ్స్ పరిష్కరించాలని అన్నారు. కావున ఐటిడిఎ అంబులెన్స్ డ్రైవర్స్ సమస్యలపై పీఓ చొరవ చూపాలని కోరారు. అలానే తమ సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమం లో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శృంగవరపుకోటలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను సందర్శించిన ఎమ్మెల్సీ ఇందుకురి రఘురాజు



**శృంగవరపుకోట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** స్థానిక శృంగవరపుకోట పట్టణంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆకస్మికంగా సందర్శించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ ఇనాగరేషన్ జరిగి రెండు నెలలు గడిచిన ఇంకా హాస్పిటల్ పనులు పూర్తి కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు..నాబార్డ్ నిధుల నుండి హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణం కొరకు 12 కోట్లు రూపాయలు మంజూరయ్యాయని అందులో 5.22 కోట్లకు బిల్లులు సాంక్షన్ చేయడం జరిగిందని ఇంకా 6.59 కోట్ల రూపా యలు బ్యాలెన్స్ శాంక్షన్ అవ్వాల్సి,ఉందని, అంతే కాకుండా 79 లక్షల రూపాయలు హాస్పిటల్ ఎక్విప్మెంట్ కోసం కేటాయించారని తెలియ జేశారు.. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పేషెంట్లు డయాలసిస్ చేయించుకు నేందు కు విశాఖపట్నం వెళ్లేవారని, అక్కడికి వెళ్లేందుకు అన్ని రకాలుగా ఇబ్బందులు పడేవారని ఇప్పుడు ఆ అవసరం లేకుండా శృంగవ రపు కోటలోనే ప్రభుత్వ ప్రాంతీ య వైద్యశాల ప్రారంభించి డయాల సిస్ చేస్తున్నారని ఇది శృంగవ రపు కోట చుట్టుపక్కల కిడ్నీ సమస్యలతో బాధపడు తున్న గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలియ జేశారు అంతేకాకుండా హాస్పిటల్ సూపరి ండెంట్ నీలా, మరియు డాక్టర్ బిఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లా డుతూ హాస్పిటల్ నిర్మా ణం పనులు పూర్తిస్థాయి లో జరగలేదని, హాస్పిటల్ కు కావలసిన వైద్య పరికరాలు, ఎక్విప్మెంట్ పూర్తి స్థాయిలో రాలేదని అవి వస్తే ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అంది స్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజుతో పాటు, ఎంపీపీ సోమేశ్వర రావు, సర్పంచ్ సంతోష్ కుమారి, పార్టీ కార్యకర్తలతో పాటుహాస్పిటల్ వైద్యసిబ్బం ది పాల్గొన్నారు

## ఖరీఫ్ కార్యాచరణ పై రైతుసేవ కేంద్రం సిబ్బందికి శిక్షణ



**ఎస్.రాయవరం, ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఎల్ నినో ప్రభావం దృష్ట్యా 2026 ఖరీఫ్ సాగు సంసిద్ధత పై రైతుసేవకేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి రెండవరోజు శిక్షణ కార్యక్రమం ఎస్. రాయవరం మండలం పెద్ద గుమ్మ లూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఖరీఫ్ సీజన్లో ప్రతిరైతుసేవ కేంద్రంలో పిఎండి కిట్లు అందుబాటులో ఉంచను న్నట్లు వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. క్షేత్ర స్థాయిలో చేపట్టవలిసిన చర్యలును సిబ్బందికి వివరించారు. ఈకార్యక్రమంలో రైతుసేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఐదేళ్ల సేవలకు గుర్తింపుగా తామరం సర్పంచ్ దంపతులకు ఘన సన్మానం

**మాకవరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన సర్పంచ్ దంపతులు గొంతిన హరిబాబు, గొంతిన చెల్లా రత్నం దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. నర్సీపట్నం మాజీ శాసన సభ్యులు శ్రీ పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించి నందుకు వారికి శాలువాలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి ప్రజలకు మౌలిక వసతులు అందించడంలో



హరిబాబు–చెల్లారత్నం దంపతులు విశేష కృషి చేశారని కొనియాడారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించడం ద్వారా ఆదర్శ సర్పంచ్‌లుగా నిలిచారని ప్రశంసించారు. అలాగే మాజీ పార్లమెంటు సభ్యురాలు భీశెట్టి సత్యవతమ్మ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అభినందించారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్, జిల్లా మహిళా నాయకురాలు శోభా హైమావతి, నియోజకవర్గ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఎంపీటీసీ రుత్తల ఎర్రపాత్రుడు తదితరులు సర్పంచ్ దంపతుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో మాకవరపాలెం మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సర్పంచ్ దంపతులను అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలకు సీఎం సానుకూల స్పందన

**ప్రజా సంతృప్తిలో జిల్లాకు 4వ స్థానం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా సమావేశం వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుండి ప్రాజెక్టులు, సాగునీటి కాలువలు, రహదారులు, ఆసుపత్రులు మరియు విద్యాసంస్థల బలోపేతానికి సంబంధించి సుమారు 30 కీలక ప్రతిపాదనలు అందాయని, వీటిపై ప్రజాప్రతినిధులతో చర్చించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పరిపాలనకు సంబంధించి ప్రజల సంతృప్తి స్థాయిలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు సాధించిందని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. మరింత మంచి ర్యాంకు సాధించాలన్నారని తెలిపారు. విద్యుత్, ఏపీఎసఆర్టీసీ, రిజిస్ట్రేషన్ల వంటి శాఖల్లో సేవల నాణ్యతను మరింత పెంచాలని సీఎం సూచించారని చెప్పారు. ముఖ్యంగా భోగాపురం విమానాశ్రయం నుండి విజయనగరం వరకు 'అవుటర్ రింగ్ రోడ్డు' నిర్మాణానికి సంబంధించి విఎంఆర్‌డిఏ అధికారులతో చర్చించి త్వరిత గతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్–ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, బేబీ నాయన, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.

## నాగులపల్లి పిఏసిఎస్ ద్వారా విశ్రాంతి టేబుల్స్ పంపిణి



**మునగపాక , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలో గల నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా వివిధ గ్రామాలకు ప్రజల సౌకర్యార్థం విశ్రాంతి టేబుల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని నాగులపల్లి పి ఎసిఎస్ పర్సన్ ఇన్చార్జ్ ఎల్లపు వెంకట భాస్కరరావు తెలిపారు. దీనిలో భాగంగా శ్రీ మేడిమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో విశ్రాంతి టేబుల్స్ను అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే తోటాడ జిల్లా పరిషత్ హై స్కూల్ కు ఇటీవల పిల్లల సౌకర్యార్థం విశ్రాంతి టేబుల్స్ అందజేయడం జరిగిందని భాస్కరరావు తెలిపారు. పిల్లలతోపాటు 60 ,70 సంవత్స రాలు వయసుగల వృద్ధులు విశ్రాంతి తీసుకునే విధంగా ఈ టేబుల్స్ను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# చీపురు కష్టాలుకోయలేని ధరలు, మోయలేని నష్టాలు

- చీపురు సాగుదారుల ఆవేదన : మద్దతు ధర ఎక్కడ ?
- కొండెక్కిన చీపురు సాగు.. పాతాళానికి పడిపోయిన ధర
- చీపురు రైతుల కష్టానికి విలువ లేదు
- కొండల్లో పండించిన చీపురుకు మార్కెట్లో మట్టిపాలు



**హుకుంపేట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని భీమవరం పంచాయతీ పరిధిలో గంగ రాజుపుట్టు, రామచంద్రపురం, మెభ, చిట్టంపాడు, గుమ్మడిగండువా, గంగవరం తదితర గ్రామాల్లో గిరిజన రైతులు కొండచీపురు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అర ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు పోడు భూముల్లో ఈ పంటను గత ఐదు నుంచి పది సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. అయితే గత మూడు సంవత్సరాలుగా మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపట్టిన చీపుర్లను కోయడం, కూలీలకు చెల్లించడం, ఇంటి వద్ద నిల్వ ఉంచడం వంటి ఖర్చులు పెట్టుబడికే సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. నైని బుజ్జిబాబు, నైని మత్స్యరాజు, వంతల భీమన్న, పాంగి రామన్న వంటి రైతులు "ధర లేక చీపుర్లు ఇంట్లోనే పేరుకుపోతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో కనీస ధర లేకపోవడం, ప్రభుత్వ మద్దతు లేకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు నైని బుజ్జిబాబు, నైని మత్స్యరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొండ చీపురు పంటనే నమ్ముకుని సాగులు ఉన్నమన్నారు. ప్రభుత్వం గుర్తించి మా జీవన ఉపాధి తోడ్పాటు అందించే విధంగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి చీపురు సాగులోన రైతులకు ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో సాగు కొనసాగించాలా లేదా అన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారు. జీవనాధారం అయిన కొండచీపురు సాగు నష్టాల్లోకి వెళ్లడంతో కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి మద్దతు ధర ప్రకటించి, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తేనే తమకు ఊరట లభిస్తుందని రైతులు కోరుతున్నారు.



# ఏప్రిల్ 23 వరకు 'పోషణ్ పఖ్వాడా' ఉత్సవాలు : కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** జిల్లాలో ఏప్రిల్ 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు 8వ ఎడిషన్ "పోషణ్ పఖ్వాడా" (పోషణ మాసోత్స వాలు) అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న పిల్లల మేధో వికాసం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై సమాజంలో అవగాహన కల్పించడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ఏడాది "జీవితం తొలి ఆరేళ్లలో మెదడు అభివృద్ధిని పెంచడం అనే ప్రధాన అంశంపై ఈ కార్యక్ర మాలు దృష్టి సారించనున్నాయి. ముఖ్యంగా పిల్లల పోషణ మరియు సంరక్షణలో పురుషుల భాగస్వామ్యాన్ని పెంచడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్వహించబోయే కీలక కార్యక్రమాలు: ఈ పక్షం రోజుల పాటు వివిధ థీమ్‌ల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి 1000 రోజుల సంరక్షణ: గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారంపై



అవగాహన కల్పించేందుకు "సుపోషిత్ జనని – స్వస్థ్ శిశు" పేరిట కమ్యూనిటీ మీటింగ్స్ నిర్వహిస్తారు. అలాగే తండ్రుల కోసం "సూపర్ డాడ" రెసిపీ పోటీలు నిర్వహించి, పిల్లలకు అందించే అనుబంధ ఆహారం తయారీలో వారికి శిక్షణ ఇస్తారు. జంక్ ఫుడ్ రహిత సమాజం: ప్యాకెట్ ఫుడ్స్ వల్ల కలిగే అనర్థాలపై "నుక్కడ్ నాటక" (వీధి నాటకాలు) ద్వారా అవగాహన కల్పిస్తారు. "స్వాప్ ది స్నాక" పేరుతో జంక్ ఫుడ్‌కు బదులుగా చిరుధాన్యాలతో చేసిన సాంప్రదాయ ఆహారాన్ని అలవాటు చేసే ప్రదర్శనలు నిర్వహిస్తారు. ప్రారంభ విద్య మరియు ఎదుగుదల (3–6 ఏళ్లు): పిల్లల్లో మేధో వికాసం కోసం "ఖేల్ సే సీఖ" (ఆటల ద్వారా నేర్చుకోవడం) కార్నివాల్స్, రీసైకిల్ వస్తువులతో బొమ్మల తయారీ (టాయ్–ఏ–థాన్) వంటి పోటీలు ఉంటాయి. తండ్రులు కథలు చెప్పే "స్టోరీ టైమ్ విత్ పాపా" కార్యక్రమాన్ని కూడా ప్రోత్సహిస్తారు. అమలు మరియు నివేదికలు:ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమాన్ని హై–రిజల్యూషన్ ఫోటోలతో డాక్యుమెంట్ చేయాలని, సోషల్ మీడియాలో సరైన హ్యాష్ ట్యాగ్‌లతో ప్రచారం చేయాలని సూచించారు. 25 నుండి 35 ఏళ్ల లోపు వయస్సు గల పెద్దలకు పోషణ మరియు మెదడు అభివృద్ధిపై చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం మరియు కమ్యూనిటీ భాగస్వామ్యంతో ఈ "జన్ ఆందోళన" (ప్రజా ఉద్యమం)ను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కెవి బాలామణి, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ జీవనరాణి, డిఆర్డిఏ ఎపిడి కి.సావిత్రి, మెప్మా పిడి జీవి చిట్టిరాజు, విద్యాశాఖ ఏడి అరుణజ్యోతి, నోడల్ అధికారి బిటి నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 16 నుంచి 30 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్

**- మే 1 నుంచి 30 వరకు ఇంటింటి గణన**

**ఎలమంచిలి టౌన్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న భారత జనగణనలో భాగంగా ముందస్తుగా గృహ ఎన్యుమరేషన్ ను నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

అనకాపల్లి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్విజయ్ కృష్ణన్, ఆదేశాల మేరకు, జిల్లా రెవెన్యూ అధికారి వై ఎస్ వి కె జి ఎస్ ఎల్ సత్యనారాయణ రావు పర్యవేక్షణ లో జిల్లాస్థాయిలో ట్రైనర్లకు ఇప్పటికే ఈ ప్రక్రియ ముగిసింది. వారి ద్వారా ప్రస్తుతం ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. మే 1 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిం చనున్న గృహ గణనకు సంబంధించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ప్రజలు ఎవరికి వారు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కు (వ్యక్తిగతంగా) ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు తమ సెల్ ఫోన్ ద్వారా వివరాలను నమోదు చేసుకున్న వారికి ఒక ఐడీ నంబర్ వస్తుంది. ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీ నంబర్ చెప్తే సరిపోతుంది. వ్యక్తిగతంగా వివరాలు నమోదు చేసుకోలేకపోతే తమ నివాసాల వద్దకు వచ్చినప్పుడు ఎన్యుమరేటర్ అడిగిన అన్ని వివరాలను చెప్పాల్సి ఉంటుంది. గృహ గణన సమయంలో ఎన్యుమరేటర్ ఒక్కో కుటుంబం నుంచి 34 అంశాలను సేకరిస్తారు అని తహసీల్దారు వరహాలు ఒక ప్రకటన లో తెలిపారు.

## మునగపాక పీహెచ్‌సిని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**మునగపాక , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డా. ఎం.హైమవతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రికి వస్తున్న వ్యాధి గ్రస్తులకు అందుతున్న వైద్యం పరిశీలిం చారు. ఆసుపత్రికి వచ్చిన వారందరికీ విధిగా అభ ఐ డి లు నమోదు చేయవలెనని సిబ్బంది ని ఆదేశించారు. మునగపాక ఆసుపత్రి పరిధిలో ఉన్న 14 సం. ల బాలికలకు, హెచ్.పి.వి.వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని, తద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారించడానికి అవుతుందని సూచించారు. ఆసుపత్రి పరిధిలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి, తగు సూచనలు చేశారు. ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మలాడ గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని కూడా తనిఖీ చేశారు. గ్రామస్థులలో 18సం.ల వయస్సు పైబడిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిం చాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా గణాంకాధికారి శ్రీ ఏ.రామచంద్ర రావు, వైద్యాధికారులు డా.ఎన్ .విమల గిరి, డా. చైతన్య రామ్, సిహెచ్ఓ ఆర్. దేవకాంత, పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నడపాలి : చిరంజీవి



**నర్సీపట్నం రూరల్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని నర్సీపట్నంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 4000 మంది మధ్యాహ్నం భోజనం కార్మికులు ప్రభుత్వం స్కూళ్ళల్లో వంటలు వండుతున్నారని వాళ్ళను తీసేసి స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని ప్రయత్నం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని ప్రభుత్వమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకి కనీస వేతనాలు పదివేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని ప్రతి నెల 5వ తారీఖున జీతాలు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 13వ తేదీన నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన అందరికీ పిలుపునిచ్చారు.

## శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగస్వాములు కావాలి



**కోటవురట్ల , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఎప్పుడు నిర్వహించినా ప్రజలు భాగస్వామ్యం కావాలని కోటవురట్ల ఎంపీడీవో చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పీకె పల్లి, రామన్నపాలెం గ్రామంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో ఎంపీడీవో పాల్గొన్నారు. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు రోజూ చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. క్లాప్ మిత్రలు రోజు చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సంపద కేంద్రాల్లో చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. ఎరువులు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని అన్నారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

## అమరావతి చట్టబద్ధతకు మహారాష్ట్ర తెలుగు ప్రజలు అభినందనలు



**విజయనగరం , (మననులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడంతో హర్షం వ్యక్తం చేస్తూ మహారాష్ట్రలోని రీగల్ ప్లాజా, వసంత విహార్‌లో (థానే వెస్ట్) ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా అమరావతి రాజధానికి సహకరించిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మూర్ ,దేశ ప్రధానమంత్రి వర్యులు నరేంద్ర మోడీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, మద్దతు ప్రకటించిన వివిధ రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలుపుతూ “ థాంక్స్ మీట్ “ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజధాని అమరావతి చట్టబద్ధతపై ఐదు కోట్ల ఆంధ్రుల తో పాటు ప్రపంచంలో తెలుగు వారంతా ఒక్కటై మద్దతు ప్రకటించి పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడంతో తెలుగు వారంతా సంబరాలు చేసుకొని ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో రాజధాని అమరావతికి సహకరించిన పెద్దలందరికీ, రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలుపుతూ థాంక్స్ మీట్ చేయడం అభినందనీయమని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు ఆధ్వర్యంలో రాజధాని అమరావతి బ్రాండ్‌తో ఆంధ్రప్రదేశ్ని అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉంచుతూ స్వర్ణాంధ్ర 2047 సాకారం చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవనాయుడు , మహారాష్ట్ర తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు జగన్ బాబు, జనరల్ సెక్రెటరీ అశోక్ బాబు, కార్యవర్గ సిబ్బంది గుప్తా మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలో నీటి వనరుల పునరుద్ధరణ : కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచడం,నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా జలధార - జలహారతి కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అప్సక్ బృందానికి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన ప్రాజెక్ట్ జలధార - జల హారతి 100 రోజుల కార్యక్రమంపై (ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్) బృందం శుక్రవారం కలెక్టర్ ఛాంబరులో కలిసింది. ఈ సందర్భంగా మిషన్ - మోడ్, కాల పరిమితితో కూడిన విధానం ద్వారా నీటి వనరుల నిర్వహణను బలోపేతం చేయడం, జలాశయాలను, చెరువులను పునరుజ్జీవింపజేయడం దీని లక్ష్యమని జిల్లా సమన్వయ అధికారి కె.శ్రీనివాసు కలెక్టర్ కు వివరించారు. వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధి మరియు దీర్ఘకాలిక స్థితిస్థాపకతకు మద్దతుగా, సుస్థిరమైన, సమీకృత పద్ధతుల ద్వారా జలాశయాలను పునరుద్ధరించడం, భూగర్భ జలాలు పెంచడం మరియు నీటి లభ్యతను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తుందని అన్నారు. ఈ బృందం 9 నుంచి జిల్లాలో క్షేత్ర పర్యటనను ప్రారంభి స్తుందని, సమర్థవంతమైన ప్రణాళిక, అమలు కోసం శాటిలైట్ రిమోట్ సెన్సింగ్ డేటా, జి ఐ స్ -ఆధారిత థీమాటిక్ మ్యాప్‌లు, నీటి వనరుల మ్యాప్‌లు (బేసిన్‌లు, సబ్-బేసిన్‌లు, డ్రైనేజీ మరియు నీటి వనరులు) మరియు సంబ ంధిత జియోస్పేషియల్ మౌలిక సదుపాయాలతో సహా ఏ పి స్ ఏ సి వనరులను ప్రదర్శించడం మరియు ఉపయోగించడం

ఈ పర్యటన యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన కలెక్టర్ కు వివరించారు.

## జాతీయ రెవెన్యూ సర్వేర్లు దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం




**పాడేరు టౌన్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** జాతీయ సర్వేయర్ల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెవెన్యూ సర్వేర్లు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.స్థానిక జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ వద్ద రెవెన్యూ సర్వేర్లు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ఎంతో గొప్ప విషయమని జిల్లాలోని రక్తపు నిలువలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు తాము ఇచ్చిన రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో ఔత్సాహికులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జాతీయ సర్వేర్ల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు మాట్లాడుతూ..రెడ్ క్రాస్ సొసైటీ ని మరింత బలోపేతం చేసి జిల్లాలోని రక్తపు నిలువలు పెంచడానికి అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళుతున్నామని స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన సర్వే లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్వేర్ల సంఘ నాయకులు, స్వామి నాయుడు, ఈశ్వర్ దొర డాక్టర్ రాజీవ్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ గంగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోర్ర నాగరాజు,కోశాధికారి సూర్య రావు,సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం : సిడిపిఓ సువర్ణమ్మ

**తల్లిపాలే అమృతం : పోషణ పక్వాడలో అవగాహన**



**హుకుంపేట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని శోభకోట పంచాయతీ అంగన్వాడి సెంటర్ వద్ద శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఐసిడిఎస్ శాఖ సిడిపిఓ గునుపూడి సువర్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి సమతుల ఆహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానం అని, జననం తర్వాత తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆరు నెలల తర్వాత పౌష్టికాహారాన్ని అలవాటు చేయాలని, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పప్పుధాన్యాలు వంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఐసిడిఎస్ ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి.జానకి. అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వినూత్న రీతిలో వంతెన నిర్మాణం పూర్తి చేయాలంటూ చిన్న పిల్లలు నిరసన



**జియ్యమ్మవలస , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మేము చిన్నారులం, 10వ తరగతి చదివిన తర్వాత కాళాశాల చదువులకు పార్వతీపురం లేదా, కొమరాడ వెళ్లాలి అన్న పూర్ణపాడు – లాభేషు వంతెన నిర్మాణం పూర్తి కావాలని చిన్నారులు ద్వారా సి.పి ఎం. ఆధ్వర్యం లో శుక్రవారం ధర్నా జరిగింది.

సి.ఎం నారా చంద్ర బాబు ,డిప్యూటీ సి.ఎం పవన్ కళ్యాణ్, ఈ పూర్ణపాడు లాబేసు వంతెన పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కొమరాడ మండలం కెమిశీల పంచాయతీ గాజులు గూడ గ్రామంలో చిన్నపిల్లలు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు వాకాడ ఇందిరా కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కొమరాడ మండలానికి సంబంధించి 31 పంచాయతీల్లో తొమ్మిది పంచాయతీలకు గాను 40 గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ వంతెన వల్ల విద్యా వైద్యం అందాలంటె పనులు పూర్తి కావాలన్నారు. ప్రజలందరూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ,ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ వంతెన కి సంబంధించి నిధులు విడుదల చేసి ,ఈ వంతెన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు

# డ్వాక్రా ఎస్ హెచ్ విఒఏల సమస్యలు పరిష్కరించాలి



**దేవరాపల్లి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** డ్వాక్రా ఎస్ హెచ్, విఒఏల సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తు శుక్రవారం దేవరాపల్లి ఎపిఓ కు విఒఏలు ఒ.బిలు వినతి పత్రం సమర్పించారు. వీరికి మద్దతుగా సిఐటియు మండల కార్యదర్శి బి.టి దొర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న మాట్లాడారు. ఇటీవల గ్రూపు సభ్యులందరూ ఎస్ఆర్ఎస్ యాప్ ద్వారా 80 శాతం సభ్యులు హాజరవ్వాలనే నిబంధన వలన సభ్యులందరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యధిక మంది రోజు వారీ కూలి పనులు చేసుకునే వారెననీ ఉదయాన్నే వెళ్లి రాత్రికి ఇళ్లకు చేరుకుంటున్నారని తెలిపారు. కొంత మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కొన్ని రోజులు పనులు చేసుకుని తిరిగి వస్తున్నారని పేర్కొన్నారు. కొంత మంది పట్టణాల్లో వివిధ పనులు చేసుకుం టూ నెలలో కొన్ని రోజులు తరువాత గ్రామాలకు వస్తున్నారని ఈ నేపథ్యంలో విఓఏల ద్వారా ఎఫ్.ఆర్.ఎస్. హాజరు కోసం ఒకే దగ్గర అందరు, ఒకే సమయంలో సమావేశం కావడం కుదరడం లేదన్నారు. కాబట్టి ఎఫ్.ఆర్.ఎస్.యాప్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అలాగే 10 లక్షల రూపాయల వరకు వడ్డీ రాయితీ ఇస్తామని ప్రభుత్వ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అలాగే సంఘాలలోనే సభ్యులుగా ఉంటూ సంఘాల కార్యకలాపాలను నిర్వహిస్తున్న విఓఏలకు తక్కువ గౌరవ వేతనంతో కాలం ఈడ్చు తు న్నారని విఓఏలకు గత 3 నెలలుగా వేతనాలు లేక వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని తెలి పారు. సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రం లోని ఈనెల 27, 28 తేదీలలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె.సూరిబాబు, జి.రా ము, కె.సృజన, జి. వరలక్ష్మి, జి.వెం కటి, కె. అప్పారావు, జి.లావణ్య, డి. జెమిని ,వి.దేవితదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో సహజ వ్యవసాయంపై క్షేత్రస్థాయి శిక్షణ

**సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ కల్పిస్తున్న మండల అధికారిని శ్రీలక్ష్మి**



**నెల్లిమర్ల , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని కొత్తపేట గ్రామంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఐసీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. సహజ వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ఫీల్డ్ శిక్షణ కొనసాగుతోంది. ప్రాయోగిక అవగాహన శిక్షణలో భాగంగా అభ్యర్థులు గ్రామంలోని పలు నమూనా విభాగాలను సందర్శించారు. బహుళ పంటల సాగు ద్వారా తక్కువ విస్తీర్ణంలో గరిష్ట ఆదాయం పొందే విధానాలను పరిశీలించారు. ఇక్కడ తయారు చేస్తున్న వివిధ రకాల ప్రకృతి సిద్ధమైన ఎరువులు, కషాయాల గురించి తెలుసుకున్నారు. శిక్షణార్థులకు కేవలం సిద్ధాంతపరంగానే కాకుండా, ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా కీలకమైన తయారీ విధానాలను వివరించారు. విత్తన శుద్ధి, మట్టి ఉండల తయారీ ద్వారా మొలకల శాతాన్ని ఎలా పెంచాలో వివరించారు. భూసారాన్ని పెంచే ఘన జీవామృతం, మొక్కల ఎదుగుదలకు తోడ్పడే ద్రవ జీవామృతం తయారీలో మెళకువలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి శ్రీలక్ష్మి, ఎ ఇఓ నాగరాజు పాల్గొన్నారు.

# వృద్ధుల వయసు నిర్ధారణ పత్రాల సమస్యపై ఎమ్మెల్యే మాధవి స్పందన

**వృద్ధుల వయసు నిర్ధారణ పత్రాలు జాప్యం పట్ల అధికారులను నిలదీసిన లోకం నాగ మాధవి**



**నెల్లిమర్ల , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** విజయనగరం జిల్లాలో వృద్ధులు ఎదుర్కొంటున్న వయసు నిర్ధారణ పత్రాల జాప్యంపై నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు జనజాగృతి సంస్థ ఉత్తరాంధ్రా కన్వీనర్ శీరాపు శ్రీనివాస రావు ఎమ్మెల్యే ని కలిసి, జిల్లాలో సుమారు 3,733 మంది వృద్ధులు పత్రాలు అందక ఇబ్బంది పడుతున్నా రని, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొందరు వృద్ధులు మరణిస్తున్నారని వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం అందిన వెంటనే ఎమ్మెల్యే ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఫోన్లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని దాదాపు రెండేళ్లుగా జి.జి.హెచ్ సూపరింటెండెంట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వయసు నిర్ధారణ పత్రం పొందే సరళమైన విధానాన్ని ప్రజలకు వివరించారు. వయసు నిర్ధారణ పత్రం కావాల్సిన వారు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో రూ :500 రూపాయల చలానా చెల్లించాలి. చలానా కట్టిన వెంటనే ఆ సమాచారం PD DRDA కార్యాలయానికి చేరుతుంది. దీని ఆధారంగా అధికారులు వెంటనే ధ్రువీకరణ పత్రం జారీ చేసేలా చర్యలు తీసుకుంటారు. ఒకవేళ చలానా కట్టిన తర్వాత కూడా ధ్రువీకరణ పత్రం రాకపోయినా, లేదా ఏవైనా ఇబ్బందులు ఎదురైనా నేరుగా ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. అలసిన బ్రతుకులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వృద్ధులకు పెన్షన్లు మరియు ఇతర సౌకర్యాలు అందడానికి కీలకమైన ఈ పత్రాల జారీలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు," అని లోకం నాగ మాధవి స్పష్టం చేశారు.

# మంచినీటి సమస్యపై పాడేరు గ్రీవెన్స్ లో ఫిర్యాదు



**అరకులోయ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం వడగడ పంచాయతీ దానిరంజిని గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని పాడేరు గ్రీవెన్స్ లోశుక్రవారంగ్రామమహిళలతోపాటు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అరకులోయ మండలం మాడగడ పంచాయతీ దానిరంగిని గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వేసిన బోరు పూర్తి చేయకుండా గుట్టేదారుడు అసంపూర్తిగా వదిలేయడంతో దాని రంగిని గ్రామంలో మంచినీటి సమస్యతీవ్రంగాఉందనిగ్రామానికి చెందిన మహిళలతో కలిసి శుక్రవారం పాడేరు ప్రజావాణిలో ఫిర్యాదు చేసామన్నారు.అయితే మండల స్థాయి అధికారులకు పలుమార్లు గ్రామంలో ఉన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని విన్నవిం చినప్పటికి మండల స్థాయి అధికారులు స్పందించక పోవడంతో జిల్లా స్థాయి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాలన్న భావనతో శుక్రవారం పాడేరుగ్రీవెన్స్కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నా రు. వేసవికాలం సమీపి స్తుండడంతో గ్రామములో నీటి ఎద్దడి తీవ్రంగా ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా జల్ జీవన్ మిషన్ అధికారులు తూతు మంత్రంగా మర మత్తు చేస్తుండడం వల్ల మూడు నెలల ముచ్చటకే అనే చందంగా తరచూవు రమ్మతు కుగురవు తుందన్నారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత శాఖ అధికారులు స్పందించి దానిరంగిని గ్రామంలో ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యను పరిష్కారం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ సత్య రావు,టి దామోదర్ ,బాబురావు, రంభమణి ధనముద్ది, జమున, మోయిన, రాములమ్మ, సుమంతి, మాలతి, హరి, ప్రమీల, లక్ష్మి, కమల, తదితరులు పాల్గొన్నారు.

# లక్షల్లో వ్యయం..పథకం శూన్యం

## - నిరుపయోగంగా ఉన్న వాడ్రాపల్లి శ్రీ పారిపల్లెమ్మ ఎత్తిపోతల పథకం


**మునగపాక , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలో వాడ్రాపల్లి పారిపల్లమ్మ ఎత్తిపోతల పథకం ద్వారా వాడ్రాపల్లి ఆవనుండి రైతులకు సమృద్ధి జలాలను పంటలకు అందించేందుకు 2001వ సంవత్సరంలో అప్పటి పరవాడ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో 36 లక్షల రూపాయలతో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. సుమారు 333 ఎకరాలకు 300 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ప్రారంభం నుండి కొన్ని ఏళ్లుగా సమృద్ధి జలాలను వాడ్రాపల్లి ఆవనుండి నుండి ఎత్తిపోతల పథకం ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు అందించేవారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ భూములు సస్యశ్యామలంగా సమృద్ధిగా పంటలు పండి రైతులకు ఎంత





గానో ప్రయోజనం చేకూరేది. అప్పట్లో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకం చైర్మన్గా అప్పటి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కార్యదర్శిగా ఎల్లపు సూర్య అప్పారావును నియమించారు. కొద్దికాలం సజావుగానే పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే ఇటీవల కాలంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా పట్టించుకో కపోవడం వల్ల వృధాగా పడి ఉంది. మధ్యలో కొద్దిగా డబ్బు మంజూరు కావడంతో ఎత్తిపోతల పథకం బిల్డింగ్ కు రంగులు వేసి మామ అనిపించారు. ఈ పథకం పై పూర్తిగా నిర్లక్ష్యపు నీడలు ఆవరించుకోవడంతో మూలన పడి మోటార్లు మరమ్మ త్తులకు గురవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయన ఎత్తిపోతల పథకంపై దృష్టి సాధించి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సమృద్ధిగా నీటి జలాలను పంటలకు సాగు జరిగే విధంగా కృషి చేయాలని పలు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ కు విశేష స్పందన



**ఎస్. రాయవరం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** పిఆర్ టీచర్స్ యూనియన్ అధ్వర్యంలో ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ కేంద్రంకు మూడురోజులు లోనే విశేష స్పందన లభించింది. తుని, పాయకరావుపేట, నక్కపల్లి, యలమంచిలి, అచ్యుతాపురం, ఎస్. రాయవరం ప్రాంతాలుచెందిన విద్యార్థులుపెద్ద సంఖ్యలోహాజరయ్యారు. పిఆర్టీయు మండల శాఖ అధ్యక్షులడు బాలు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్స్ చదువుకోవడం వలన జూనియర్ ఇంజనీర్ లేదా టెక్నిషియన్ స్థాయి ఉద్యోగాలను పొందవచ్చుని, టెక్నికల్ రంగాలలో అసిస్టెంట్ పోస్టులకు, సివిల్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రా నిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి అనేక విభాగాలలో స్పెషలైజేషన్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున ఉద్యోగ అవకాశాలు మెరుగు పడ్తాయన్నారు.

# భూగర్భ జలాల అభివృద్ధిపై గ్రామసభ



**దేవరాపల్లి ,ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని తామరబ్బ గిరిజన పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం భూగర్భ జలాలు అభివృద్ధి లక్ష్యంగా చెరువులు, చెక్ డ్యామ్స్ గుర్తించి వాటిని గ్రామాల్లోని చెరువులు నీరు పరిరక్షణ ప్రజలు కాపాడుకోవాలని గ్రామ సభలో చర్చించారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వరలక్ష్మి, తామరబ్బ పంచాయతీ టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు శెట్టి మంగరాజు, ఎనర్జీఎస్ విఆర్పి అప్పలరాజు,గ్రామ పెద్దలు, మహిళ లు పాల్గొనడం జరిగింది.

# కళాభారతిలో పైడా కౌషిక్ నాటకోత్సవములు

**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఈ నెల 12,13,14,15,16 తేదీల్లో పితాపురం కాలనీలోని కళాభారతిలో పైడా కౌశిక్ నాటకోత్సవములు నిర్వహిస్తున్నట్టు వి.ఎమ్.డి.ఎ. ట్రస్టీ నాటకోత్సవాల అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా నాటకోత్సవాలు నిర్వహి స్తున్నమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 38 ఎంట్రీలు ఈ ఏడాది వచ్చాయని, వాటిన న్నింటిని ప్రోగ్రాం కమిటీ సభ్యులం దరూ అధ్యయనం చేసి 9 నాటికల ను ఎంపిక చేశారని తెలిపారు. మొదటి నాలుగు రోజులు, రోజుకు రెండు నాటికలు, చివరి రోజు 16-4-2026న ఒక నాటిక ప్రదర్శించబడి, ఆ తరువాత బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. వి.ఎమ్.డి.ఎ. ట్రస్టీ నాటకోత్సవాల ప్రధాన కార్యదర్శి డా.జి.ఆర్.కె. ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ ఈ పోటీలలో నాటికలను ప్రదర్శించే స్థానికేతర సమాజముల వారికి ప్రదర్శన పారితోషికం రూ. 16



,000లతో పాటు లోకల్ కన్వేయన్స్ నిమిత్తం రూ.4000లను అదనంగా అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రదర్శన రోజున వారికి వసతి ఉచితంగా వసతి కల్పిస్తున్నామని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి, ఉత్తమ ప్రదర్శనకు రూ.20,000లు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.15,000లు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.12,000లు చతుర్థ ఉత్తమ ప్రదర్శనకు రూ.10,000లు నగదుతో పాటు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఇదిగాక 12 వ్యక్తిగత బహుమతులు ఒక్కొక్కరికి రూ.1500లు, జ్ఞాపికలు అందజేయడంతో పాటు మూడు జ్యూరీ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1000ల నగదుతో పాటు జ్ఞాపికలు అందిస్తామన్నారు. ప్రోత్సాహక బహుమతుల క్రింద నాటికలలో పాల్గోన్న ప్రతి బాల, నటీ నటులకు రూ.1000ల నగదుతో పాటు జ్ఞాపికలు బహూకరించబడతాయని తెలిపారు. ఈ పోటీలలో ప్రదర్శించిన ప్రతి నాటిక రచయిత, దర్శకుడికి మల్టీ కలర్డ్ లామినేటెడ్ సర్టిఫికెట్స్ లను నాటిక ప్రదర్శన అనంతరం, వేదిక మీద అతిథుల చేతుల మీదుగా అందజేయబడుతాయని వెల్లడించారు. నాటకోత్సవాల మహారాజపోషకులు పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేల మీద ప్రఖ్యాతి గాంచిన ఈ నాటకోత్సవాలకు మహారాజ పోషకులుగా వుండటం తనకు సంతోషాన్ని కలిగిస్తోందని, రాబోయే కాలంలో కూడా ఈ నాటకోత్సవాల నిర్వహణకు తనవంతు సహాయ సహకారాలు ఇలాగే కొనసాగిస్తానని తెలిపారు. అన్ని రోజులు నాటికల ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని, వచ్చిన నాటక ప్రేక్షకులకు ప్రతిరోజు లాటరీ తీసి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఛీఫ్ అడ్వైజర్ ఆచార్య బాబివర్ధన్ మాట్లాడుతూ ఈ నాటకోత్సవాల విజయంలో పాత్రికేయుల పాత్ర చాలా విశిష్టమైనదని, ఈ ఉత్సవాల సమాచారాన్ని రెండు రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాల వారికి తెలియజేసే బాధ్యతను వారు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాటకోత్సవాల ఎగ్జిక్యూటివ్ కన్వీనర్స్ బొడ్డేటి జగన్రావు, పి. నరసింగరావుతో పాటు ఇతర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## ట్రాంజెండర్స్ కు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం : సీపీ బాగ్చీ



**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** జీవీఎంసీలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న ట్రాంజెండర్స్ నగర పోలీసు కమీషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీని ఘనంగా సత్కరించారు. నగరంలో సిగ్నల్ పాయింట్ల వద్ద వుండే ట్రాంజెండర్స్ కు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ఏడాది 19.12.2025న సీపీ బాగ్చీ 20 మంది ట్రాంజెందర్స్ కు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో స్వీపర్ ఉద్యోగాలకు అవకాశం కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో వారు విధులకు చేరి నేటికి 72 రోజులు పూర్తయింది. దీంతో వారి వేతనాలు వారి బ్యాంకు అకౌంట్ లో జమ ఆయ్యాయి. దీంతో వారు తమ సంతోషం వ్యక్తం చేస్తూ సీపీ బాగ్చీని నగర పోలీసు కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం కలిసి కృతజ్ఞతలు తెలిపి పూలమాలతో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురవుతూ, ఇబ్బందులకు గురవుతూ, ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ రోడ్లపై భిక్షం చేస్తున్న మిగిలిన ట్రాంజెండర్స్ కోసం సమాజంలో కొత్త వ్యక్తులు గాని, కంపెనీలు గాని సరైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దీని వలన వారు సమాజంలో గౌరవప్రదమైన జీవనాన్ని గడపడానికి, వారిపై జరుగుతున్న వివక్షను నిరోధించడానికి అవకాశం కల్పించిన వారమవుతామని తెలిపారు.

## సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలి

### కేజీహెచ్ జనరల్ ఫిజీషియన్ చీఫ్ డాక్టర్ బి.శ్రీనివాసరావు




**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** సేవా కార్యక్రమాలను చేసేవారిని ప్రోత్సహించాలని కేజీహెచ్ జనరల్ ఫిజీషియన్ చీఫ్ డాక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నరవ రాంబాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఉదయం సెంట్రల్ పార్క్ లోని ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏలియన్స్ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల చైర్మన్ డాక్టర్ కొల్ల సతీష్, కేజీహెచ్ జనరల్ ఫిజీషియన్ చీఫ్ బి.శ్రీనివాసరావు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫీమినా కొల్ల పుష్ప, వైకాపా ఇంటలెక్చువల్ ఫోరమ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు, అడ్వకేట్ శ్రీనివాస్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రాము పాత్రుడు తదితరులు రాంబాబుతో కేకును కట్ చేయించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ వారి దంపతులకు ఘనంగా సన్మానించారు. అనంతరం నరవ రాంబాబు సేవలను కొనియాడుతూ, సెంట్రల్ పార్క్ వద్ద విశాఖ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జికను పంపిణీ చేశారు.

# డోలి రోడ్ల పనులను సత్వరమే పూర్తి చేయాలి

### 20 లోగా బిల్లులన్నీ ఆన్ లైన్ నందు నమోదు కావాలి జేసీ

**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు సాధించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లుగా అనేక పనులు అటవీ అనుమతులు లేక ఆగిపోయాయని, అటవీ భూములకు బదులుగా కేటాయించాల్సిన ప్రత్యామ్నాయ భూముల విషయంలో రెవెన్యూ మరియు అటవీ శాఖల మధ్య సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని అభిప్రాయ పడ్డారు. అటవీ అనుమతుల కోసం పంపే ప్రతిపాదనలు ఖచ్చితమైన ఫార్మాట్‌లో ఉండాలని, అసంపూర్తిగా ఉన్న నివేదికలను ఉపేక్షించబోమని జేసీ హెచ్చరించారు. జూనియర్ ఇంజినీరింగ్ అధికారులు నివేదికలు సరిగా ఇవ్వకపోతే, ఉన్నతాధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సరిచేయాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ అభ్యంతరాలను వెంటనే నివృత్తి చేయాలని, సంబంధిత ఫైళ్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ప్రగతిలో ఉన్న వివిధ పథకాల నిర్మాణాలకు చెందిన బిల్లులను ఈ నెల 20లోగా ఆన్ లైన్ నందు నమోదు చేయాలని అన్నారు. డోలీ రోడ్లన్నీ సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలవు తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిని సమీ క్షిస్తూ, అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేసారు.

ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి జి.ఏ.పీ.ప్రసూన, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, ఐసీడిఎస్ పీడీ డా. టి.కనకదుర్గ, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్. మన్మధరావు, జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ పి.సువర్ణ, డీఎస్డీఓ కె.సాయికృష్ణ చైతన్య,ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది హబీబుల్లా కోర్టును ఆశ్రయించడంతో విశాఖ బార్ అసోసియేషన్ ఎలక్షన్ వాయిదా



**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** సీనియర్ న్యాయవాది హబీబుల్లా ప్రెసిడెంట్ కంటెస్టెంట్ గా తన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించినందుకు విశాఖ జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఇరు పార్టీల వాదనలు విన్న అనంతరం జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు సీనియర్ న్యాయవాది హబీబుల్లా ప్రెసిడెంట్ కంటెస్టెంట్ గా అర్హులని ఆయన పేరును బ్యాలెట్ పేపర్ లో చేర్చాలని ఎలక్షన్ కమిటీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది హబీబుల్లా, హబీబుల్లా తరపు న్యాయవాది వందన ఉషారాణి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తాము చట్టబద్ధంగా పోరాడి విజయం సాధించా మని జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎలక్షన్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా జడ్జి ఆదేశాల మేరకు బ్యాలెట్ పేపర్లు తయారు చేయడానికి సమయం కావాలి అని, ఏప్రిల్ 10న జరగవలసిన ఎలక్షన్ వాయిదా పడిందని, ఎలక్షన్ తేదీ త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.



# హెల్మెట్ ప్రాణరక్ష కవచం

### మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు..నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ హెచ్చరిక

**నెల్లిమర్ల , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి. హెల్మెట్ కేవలం ప్రభుత్వ నిబంధన మాత్రమే కాదు, ప్రాణ రక్షణ కవచమని నెల్లిమర్ల ఎస్ ఐ బి. గణేష్ స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లిమర్లలో నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి వారికి రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

తనిఖీల సమయంలో హెల్మెట్ లేని వాహనదారులకు ఎస్సై క్లాస్ తీసుకుంటూ పలు కీలక విషయాలను వివరించారు. గతంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన ఘోర ప్రమాదాలను, కోల్పోయిన ప్రాణాలను ఉదహరిస్తూ హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ ధరించని వారికి రూ. 1,035 జరిమానా విధిస్తామని, ఆ జరిమానా కట్టే బదులు అదే డబ్బుతో మంచి నాణ్యమైన హెల్మెట్ కొనుక్కోవాలని హితవు పలికారు. కేవలం చలానాల నుండి తప్పించుకోవడానికి కాకుండా, ప్రమాదం జరిగినప్పుడు తలకు రక్షణనిచ్చే ఐఎస్ఐ మార్క్ ఉన్న నాణ్యమైన హెల్మెట్లనే కొనుగోలు చేయాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్‌పై ఎస్సై గణేష్ కఠినంగా స్పందించారు. "తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలను ఇస్తే, ప్రమాదాలు జరగడమే కాకుండా తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తాం," అని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. వాహన తనిఖీల్లో ఎఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

# జల సంరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

## మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం



**మునగపాక , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** వృధాగా కాలవల్లోనూ నదుల ద్వారా పోతున్న జలాలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆ జలాలు భూములోకి వెళ్లే లాగా ప్రతి ఒక్కరూ ప్రణాళికలు రూపొందించాలని మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం కోరారు. జలహారతి భాగంగా మునగపాక పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మనిషి ప్రతి ఒక్కరు కూడా బ్యాంకులో డబ్బు దాచుకున్నట్టే వృధాగా పోతున్న జలాలను భూములోకి ఇంకెలా ప్రయత్నం చేస్తే అవి మన భవిష్యత్తుకు మంచి ఫలాలను అందిస్తుందని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం అన్నారు. జలాలను సౌరక్షించే బాధ్యత సాగునీటి సంఘాలకే కాకుండా ప్రజలందరిపై ఉందని భూగర్భ జలాలను పెంపొందించడానికి ఇంకుడు గుంతలు, చెరువుల్లో పూడికలు తీయించడం, సాగునీటి కాలవుల్లో పూడికితీత పనులు, కొండ ప్రాంతాల్లో యాటవాలుగా ఉన్న ప్రదేశాల్లో టన్సెస్ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు పెంపొందించబడి పంటలు సస్యశ్యామలంగా పండుతాయి అని పరశురాం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి దాడి ముసిలి నాయుడు, మునగపాక గ్రామ మాజీ సర్పంచ్ దిమ్మల అప్పారావు,బిజెపి నేత డాక్టర్ బద్దం సూర్య నారాయణ, ,గ్రామ శాఖ అధ్యక్షుడు దాడి శివ, ఎలక రవి పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆహార సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్ ప్రకటన

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిటెండెంట్ డా. ఎ.పద్మజ

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** విజయనగరం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్) పరిధిలోని హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్ పేషెంట్ మరియు డ్యూటీ డాక్టర్లకు ఆహారం సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానించబడుతున్నాయని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిటెండెంట్ డా. ఎ.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్ విలువ రూ.5000/– తో పాటు 18% జీఎస్టీగా నిర్ణయించబడగా, మొత్తం రూ.5900/– చెల్లించవలసి ఉంటుందని, ఆసక్తి గల కాంట్రాక్టర్లు టెండర్ పత్రాలను 'Hospital Development Society, GGH, Vizianagaramμμ కార్యాలయం నుండి కార్యాలయ సమయాలలో (ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు) పొందవచ్చునని తెలిపారు.టెండర్ దరఖాస్తుల సమర్పణకు గడువు ఏప్రిల్ 13, 2026 నుండి ఏప్రిల్ 20, 2026 వరకు నిర్ణయించబడిందని, సమర్పించిన టెండర్లు ఏప్రిల్ 20, 2026 సాయంత్రం 5:00 గంటలకు ప్రజల సమక్షంలో తెరవబడతాయని తెలిపారు.అభ్యర్థులు పూర్తి వివరాలను అధికారిక వెబ్సైట్ https://vizianagaram.ap.gov.in/ లో చూడవచ్చునని, మరిన్ని వివరాలకు 9704462296, 99895 10436, 7732029842 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని అర్హతగల కాంట్రాక్టర్లు ముందుకు రావాలని ఆ ప్రకటనలో ఆమె కోరారు.

# జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**ఎస్.రాయవరం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** గంధ అమావాస్య సందర్భంగా మండల కేంద్రమైన ఎస్. రాయవరం లో ఈనెల 17 న జరగనున్న నూకాంబికా అమ్మవారి జాతర లోభాగంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నక్కపల్లి రూరల్ సి ఐ ఎల్ రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. జాతర సందర్భంగా స్థానిక యూత్ అధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఈపోటీలలో విజేతలుకు జాతర రోజున బహుమతులును అందచేస్తారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ విభీషణ



రావు, స్థానిక నేతలు కొణతాల శ్రీనివాస రావు. సోమిరెడ్డిరాజు,వీసంసాయి, పితాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల పంచాయితీ ప్రత్యేక అధికారులు వీరే



**దేవరావల్లి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని 27 పంచాయితీల కు సంబంధించి ప్రత్యేక అధికారుల జాబితా జిల్లా కలెక్టర్ అధికారిక లిస్టు ప్రకటించడం జరిగిందని ఇంచార్జ్ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరాపల్లి, కాశీపురం, గరిశింగి,కొత్తపెంట,చింతలపూడి, తారువ పంచాయతీల ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపీడీవో ఎస్ కె వి ప్రసాద్, వేచలం, మారేపల్లి, మామిడిపల్లి, ములకలాపల్లి, పంచాయతీల ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, అలాగే రైవాడ, కలిగొట్ల, పెదనందిపల్లి, ఏ. కొత్తపల్లి, ముషిడిపల్లి, చిననందిపల్లి, పంచాయతీల ప్రత్యేక అధికారిగా డిప్యూటీ తహశీల్దార్ కె. అప్పారావు, ఎన్జి నగరం, వెంకట రాజ పురం, పంచాయతీల ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపీడీవో (ఎస్ జి ఎస్ డబ్ల్యూ) పి.వి. అలివేణి, ఎం. అలమండ, తెనుగుపూడి, నాగయ్యపేట, పంచాయతీల ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎల్ వై కాంతమ్మ, బోయిలకింతాడ, తిమిరాం, వాలాబు, పంచాయతీల ప్రత్యేక అధికారిగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, అలాగే వాకపల్లి, తామరబ్బ, కొత్తూరు ముత్యాలమ్మ పాలెం పంచాయతీల ప్రత్యేక అధికారిగా రైవాడ జలాశయం ఏఈ కె.నాగేంద్రబాబు, తో కూడిన బృందం ఈ 27 పంచాయితీల ప్రత్యేక అధికారులుగా కొనసాగనట్లు పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వం తొలగించిన ఫుడ్ కోర్ట్ ను తెరిపించాలని బాధితులు బిక్షాటన

## 17వ రోజుకు చేరుకున్న చిరు వ్యాపారుల రిలే నిరాహార దీక్ష

**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసు లో మాట) :** కూటమి ప్రభుత్వం తొలగించిన నైట్ ఫుడ్ కోర్ట్ ను తిరిగి తెరిపించాలని చిరు వ్యాపారులు విన్నూతంగా బిక్షాటన చేపట్టారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సెంట్రల్ పార్క్ ఫుడ్ ట్రక్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ కోర్ట్ వ్యాపారులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం కి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు బాధితులు ప్లేట్లను పట్టు కొని దీక్షా శిబిరం నుండి రోడ్డు మీదకు వచ్చి బిక్షాటన చేశారు. కార్య క్రమంలో పాల్గొని సంఘీ భావం వ్యక్తం చేసిన సిఐటియు నాయ కులు వెంకట్రావు, సింహాచలం సంయుక్తంగా



మీడియా తో మాట్లాడుతూ గత 12 రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్న నేటి వరకు అధికారులు గాని, నాయకులు గాని వారిని పట్టించుకో కపోవడం దారుణమన్నారు. గత సారత్విక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టిన సామాన్యులు కష్టాల్లో ఉంటే దక్షిణ నియోజకవర్గానికి చెందిన నాయకులు కనీసం తమ కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఫుడ్ కోర్ట్ తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణలను వేడుకున్న ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ నాయకులు వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ పార్క్ ఫుడ్ ట్రక్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో అసోసియేషన్ అధ్యక్షులు కె శ్రీకాంత్, ఎం ప్రసాద్, కార్యదర్శి ఎం.లలిత కుమారి, సభ్యులు దుంగ శ్రీను, బొగ్గు శ్యామ్ ,లక్ష్మీ, ఫుడ్ కోర్టు వ్యాపారులు పాల్గొన్నారు.

# ఆర్ల శివారు గ్రామాల్లో జీఎఫ్ఎల్ఎన్ ఎండ్లైన్ టెస్ట్ సర్వే

**రోలుగుంట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీకి చెందిన లోసం గి గిరిజన ప్రాంతం మరియు పెద్దగడువు శివారు గ్రామాల్లో జీఎఫ్ఎల్ఎన్ ఎండ్లైన్ టెస్టింగ్ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు సమగ్ర శిక్షా విభాగానికి చెందిన సిఆర్ ఎమ్టీలు పూడి వెంకట్రావు, పరవాడ సతీష్



విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి విద్యాసామర్థ్యాలను లీప్ యాప్లో నమోదు చేశారు. గత ఏడాది డిసెంబర్లో బేస్లైన్ పరీక్షలు నిర్వహించిన నేపథ్యంలో, ఇప్పుడు విద్యార్థుల అభ్యాస స్థాయిలో వచ్చిన మార్పులను పోల్చి ఈ ఎండ్లైన్ వివరాలు అప్లోడ్ చేశామని సిఆర్ఎమ్టీలు తెలిపారు.

# పరవాడలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలి : గనిశెట్టి డిమాండ్

**పరవాడ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రమైన పరవాడ లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం వెంటనే చేయాలని శుక్రవారం పరవాడ మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం సి ఐ టి యు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరవాడ గ్రామంలో సర్వే నెంబర్259లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 1.43 సెంట్లు భూమి కేటాయించి సంవత్సరం అవుతున్న క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న భూమిలో ప్రభుత్వం వారు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించి కార్మికుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మసిటీ, ఎన్టిపిసి, చిన్న తరహా పరిశ్రమల్లో ఏ చిన్న ప్రమాదం జరిగిన విశాఖపట్నం, అనకాపల్లి గాయ




పడ్డ వారినితరలించవలసి వస్తుందని ఈ లోపు మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారని వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. బర్న్ వార్డ్ ఏర్పాటు చేసి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేకసార్లు దరఖాస్తులు పెడుతున్నామని ఆందోళన చేస్తున్నామని కనీసం పట్టించుకునే చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదని ఈ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమ పట్టడం లేదని విమర్శించారు. ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గని శెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె నాయుడు, శ్రీను, గురునాథం, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర పవర్ లిఫ్టింగ్‌లో విశాఖ వాసి భవాని ప్రసాద్‌కు బంగారు పతకం



**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విశాఖ వాసి ఎన్.బి.ఎమ్ లా కళాశాల విద్యార్థి వి. భవాని ప్రసాద్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా నిర్వహించిన డెడ్‌లిఫ్ట్, బెంచ్ ప్రెస్ పోటీలలో పాల్గొన్న భవాని ప్రసాద్ 105 కేజీల (మాస్టర్స్ విభాగం) విభాగంలో మొదటి స్థానం సాధించడం విశేషం. విశాఖలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మార్చి 28, 29 తేదీలలో జరిగిన ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో భవాని ప్రసాద్ 105 కేజీల బాడీ వెయిట్‌తో 210 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తి ప్రతిభ చాటారు. ఈ విజయానికి గాను ఆయన్ను మెరిట్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో సత్కరించారు.

ఈ సందర్భంగా శుక్రవారం ఎన్.బి.ఎమ్ లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డీన్ రమణ, ప్రిన్సిపల్ గాయత్రి చేతుల మీదుగా భవాని ప్రసాద్‌కు సర్టిఫికెట్ అందజేసి, బంగారు పతకాన్ని మెడలో వేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డీన్ రమణ మాట్లాడుతూ క్రీడా రంగంలోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచడం ఆనంద దాయకం అన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించగలరని భవాని ప్రసాద్ ని అభినందించారు. ప్రిన్సిపల్ గాయత్రి మాట్లాడుతూ భవాని ప్రసాద్ విజయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు భవాని ప్రసాద్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## యలమంచిలిలో న్యాయవాదులు విధులు బహిష్కరణ



**యలమంచిలి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అన్నమయ్య జిల్లా, పీలేరు న్యాయవాదులు సంఘ సభ్యులైన పూజారి ఎల్లయ్య పై జరిగిన హత్యాకాండకు నిరసనగా శుక్రవారం యలమంచిలి న్యాయవాదులు సంఘ సభ్యులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచిలి న్యాయ వాదుల సంఘం ఉపాధ్యక్షులు ఎల్ వి. రామకృష్ణారావు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలులోకి తెచ్చేవిధముగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై వైసిపి 'విషప్రచారం'

- వైసిపి నాయకులపై ఉన్న ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే కుట్రలు!
- అమరావతిపై జగన్ వ్యాఖ్యలు సమంజసం కాదు
- టిడిపి మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు ధ్వజం

**నెల్లిమర్ల , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై, మీడియాపై అసత్య ఆరోపణలు చేస్తూ విషం చిమ్ముతున్నారని టిడిపి సీనియర్ నాయకులు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం అక్కివరం తన నివాసంలో పత్రికా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ వైసిపి వైఖరిని ఎండగట్టారు.

**టిటిడి చైర్మన్‌పై 'డిజిటల్' కుట్రలు**

వైసిపి హయాంలో తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన పాపం వారిదేనని చంద్రశేఖరరావు గుర్తుచేశారు. ఇప్పుడు ప్రస్తుత టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు ప్రతిష్టను దెబ్బతీయడానికి కృత్రిమ మేధ సాంకేతికతను వాడుకుని మార్ఫింగ్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆ వీడియోలో ఉన్న మహిళ బి.ఆర్. నాయుడుకి సన్నిహితురాలని, గతంలో షిర్డీ యాత్రకు వెళ్ళినప్పటి ఫోటోలు, వీడియోలను తప్పుగా వాడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. బాధిత మహిళ ఇప్పటికే తన వీడియోలను మార్ఫింగ్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**మీడియాపై దాడులు.. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు**

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు చేయడం వైసిపి దిగజారుడు తనానికి నిదర్శనమని చంద్రశేఖరరావు విమర్శించారు. అమరావతి విషయంలో వైఎస్ జగన్ చేస్తున్న కుట్రలను ప్రశ్నించినందుకే ఎబిఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని ఆగ్రహం



వ్యక్తం చేశారు. "ఏదైనా వార్తపై అభ్యంతరాలు ఉంటే కోర్టులకు వెళ్లాలి లేదా ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలి. అంతేకానీ దాడులు చేయడం హేయమైన చర్య" అని పేర్కొన్నారు. సొంత మీడియా సంస్థ ఉన్న వైసిపి, తోటి మీడియా సంస్థలపై దాడులు చేయడం శోచనీయమన్నారు.

**అమరావతిపై జగన్ అపోహలు - అభివృద్ధికి ఆటంకం**

రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ఎమ్మెల్యే క్వార్టర్స్, యూనివర్సిటీలు, విద్యా సంస్థలతో అమరావతి కళకళలాడనుందని దీనిని దేశానికే రెండో రాజధానిగా మార్చే ప్రక్రియ జరుగుతోందని చెప్పారు.

**జగన్ తీరుపై విమర్శ:**

అమరావతిపై మళ్లీ తీర్మానం చేయలేమా అని జగన్ మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని.. గత ఐదేళ్ల జగన్ పాలన చూసి పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయారని గుర్తుచేశారు.

**ఉత్తరాంధ్రకు మహర్దశ..**

కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారిపోనుందని చంద్రశేఖరరావు ధీమా వ్యక్తం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు విశాఖ నుంచి భోగాపురం వరకు మెట్రో రైలు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు.

**సాగు, తాగునీరు:**

నదుల అనుసంధానం ద్వారా తోటపల్లి నీటిని తారకరామ తీర్థసాగర్‌కు మళ్లించి విజయనగరం పట్టణానికి తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. రూ. 3.5 కోట్లతో రామతీర్థం గిరిప్రదక్షిణ రహదారి నిర్మించినట్లు వెల్లడించారు. "విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా మార్చడమే చంద్రబాబు ధ్యేయమన్నారు. వైసిపి నాయకులు ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మానుకుని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని కంది చంద్రశేఖరరావు హితవు పలికారు.

# కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. రాఘవ్ లాంగర్ పీఎంశ్రీ స్కూల్స్ సందర్శన

**ఆయనను సత్కరించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** విశాఖ జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. రాఘవ్ లాంగర్ సందర్శించారు. విశాఖపట్నం జిల్లా లోని పీఎం శ్రీ పాఠశాలలు కేంద్రీయ విద్యాలయం, శ్రీ విజయనగర్, జవహర్ నవోదయ విద్యాలయం కొమ్మాది పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా ప్రతి తరగతి గదిని, గ్రంథాలయాన్ని, ప్రయోగశాలలను పరిశీలించి, అక్కడి సౌకర్యాలను, అభ్యసనా వాతావరణాన్ని నిశితంగా సమీక్షించారు. ఆయన వివిధ తరగతుల విద్యార్థులతో ముచ్చటించి, వారి భాగస్వామ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, అభ్యసన ఫలితాలను అభినందించారు. పి.ఎం. శ్రీ కార్యక్రమం కింద అమలు చేస్తున్న విద్యా, సహ పాఠ్య కార్యకలాపాలు, ముఖ్యంగా వినూత్న బోధనా పద్ధతుల ఏకీకరణ, చక్కగా నిర్వహించబడుతున్న మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థుల భాగస్వామ్యం పట్ల డాక్టర్ రాఘవ్ లాంగర్ ఎంతగానో ముగ్ధులయ్యారు. ఈ పర్యటనలో పాఠశాల విద్యాశాఖ జోన్-1 ఆర్.జె.డి శ్రీ బి. విజయభాస్కర్., విశాఖపట్నం డి.ఇ.ఓ



శ్రీ.ఎన్.ప్రేమ కుమార్, సమగ్ర శిక్షా ఎ.పి.సి డా. జె.చంద్రశేఖర్, సీమాట్ లెక్చరర్ డా.ఎస్ ప్రసాదరావు, ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు.

వీరు తనిఖీ అంతటా గౌరవనీయ కార్యదర్శిని అనుసరించి, పి.ఎం. శ్రీ కార్యక్రమాల అమలుకు సంబంధించి అవసరమైన సూచనలు అందించారు. ఈ పర్యటన విజయవంతంగా, ప్రోత్సాహకరంగా సాగింది. కార్యదర్శి చేసిన పరిశీలనలు, పిఎం శ్రీ మార్గదర్శకాల అమలును మరింత బలోపేతం చేయడానికి బలమైన ప్రేరణగా నిలుస్తాయని తెలియచేశారు. పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణ తీరు, ఇతర అంశాలను పరిశీలించేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రాఘవ లాంగర్ ను గురువారం సాయంత్రం తన ఛాంబర్లో ఆత్మీయంగా సత్కరించి, జ్ఞాపిక జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అందజేశారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనధికార పార్కింగ్‌పై జిల్లా కలెక్టర్ చర్యలు




**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసు లో మాట) :** నగరంలోని ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సిటీ సర్వీస్ బస్సులు అనధికారంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సీహెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అమలు బృందాలను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. శ్రీనివాస్ యాదవ్, జి. సత్యనారాయణలను ఆ ప్రాంతంలో పర్యవేక్షణకు నియమిం చారు. ఈ బృందాలు కాంప్లెక్స్ పరిస రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో పాటు అనధికార పార్కింగ్ చేస్తున్న జజ బస్సులపై కేసులు నమోదు చేస్తాయి. ట్రాఫిక్‌కు అడ్డంకులు కలిగించే వాహనాలను తొలగించి, డ్రైవర్లు, ఆపరేటర్లలో కేటాయించిన పార్కింగ్ స్థలాలపై అవగాహన కల్పిస్తాయి. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం పలు వాహనాలను తనిఖీ చేసి.. అనధికారిక పార్కింగ్ ప్రాంతాల నుంచి తరలించారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా డిటిసి ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## నేడు మహాత్మా జ్యోతి రావుపూలే జయంతి వేడుకలు



**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసు లో మాట) :** మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు శని వారం అధికారికంగానిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలి పారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటలకు గ్రీన్ పార్కు హోటల్ సమీపం లో ఉన్న ఆయన విగ్రహానికి ఇన్ఛార్జి మం త్రి, ఇతర ప్రజా ప్రతి నిధులు పూల మాలలు వేసి నివాళులర్పిస్తార న్నారు. అనంతరం కలెక్టరేట్ మీటింగు హాలులో కూడా ఉదయం 10.00 గంట ల నుంచి ఇన్ఛార్జి మంత్రి సమక్షంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు చేయవల్సిందిగా బీసీ సంక్షేమ శాఖ అధికారులనుఆదేశించినట్లుప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతీ విద్యార్థి ఒక సైంటిస్ట్ కావాలి..టాలెంట్ ను తీసి మెరుగుపర్చుకోవాలి




**జియ్యమ్మవలస , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** విద్యార్థులు వారిలో ఉండే నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకుంటూ లక్ష్యాలను సాధించి మంచి పౌరుడిగా ఎదిగి సమాజ అభివృద్ధికి తమవంతు సహకరించాలని కురుపాం ప్రోహిబిషన్ ఒ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, పి.శ్రీనివాసరావు కోరారు. నవోదయమ్ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కురుపాం మండల కేంద్రంలో ఉన్న బాలురు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో మత్తు పదార్థాలు సేవించడం వలన సంభవించే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహచర విద్యార్థులు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి అలవాట్లకు లోనైతే తమకు తెలియజేయజేస్తే వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ఆ వ్యసనాలనుండి విముక్తి కల్పించే ప్రయత్నం చేయగలమన్నారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణా, అమ్మకం చేసే వారి వివరాలు తెలిస్తే వారి వివరాలు డిపార్ట్మెంట్ కి తెలియజేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇనస్పెక్టర్ జె.రాజ శేఖర్, సిబ్బంది హాజరయ్యారు.

# జిల్లా అధికారులందరూ పిజిఆర్ఎస్ కు (గ్రీవెన్స్ )తప్పనిసరిగా హాజరు కావాల్సిందే

**- పిజిఆర్ఎస్ కు 136 అర్జీలు**
**- రెవెన్యూ క్లినిక్ కు 28 అర్జీలు**

**పాడేరు, టౌన్ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ ) కు 136, రెవెన్యూ క్లినిక్ కు 28 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిషాంతి. టి,జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఇంచార్జి డిఆర్ఓ,కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, ఇంచార్జి ఆర్డిఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరావు లతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడంలో పాడేరు, వివిధ మండలాల తాసిల్దార్, డిటి వి.ధర్మారావు, పి.పోతురాజు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది పాల్గొని అందుబాటులో ఉండి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదుల నుండి అర్జీలు స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులను ఎంత గడువులోగా పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీదారులకు తెలిపారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి మాత్రమే హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని ఆదేశించారు. కొంతమంది అధికారులు ఒకటి, రెండు జిల్లాల్లో ఇన్చార్జిలుగా విధులు నిర్వహిస్తున్న వారు వారానికి మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు అదనపు జిల్లాల పని చేయాలని తెలియజేశారు. శాఖపరమైన ఏ అనుమతులు కైనను అధికారి మాత్రమే వచ్చి అనుమతి పొందాలని



తెలియజేశారు. పి జి ఆర్ ఎస్ లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారి ఉండాలని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే జిల్లా అభివృద్ధి సమావేశంలో సంబంధిత శాఖకు సంబంధించిన ప్రణాళిక రూపొందించుకొని సమావేశానికి హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి అధికారుల సమన్వయాన్ని సిపిఓ కో ఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహించాలని ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో ప్రతిరోజు ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు చేసేందుకు రారని, అలాగే ఫిర్యాదులు తగ్గుతాయని తద్వారా వాటిని వెంటనే పరిష్కరించగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి జిల్లా అధికారుల వివరాలు తెలిసి ఉండాలని, మండల తాసిల్దార్, ఎంపీడీవో, మండలనికి సంబంధించిన అధికారుల వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే గ్రీవెన్స్ ను కూడా నిర్ణీత గడువులోపు అర్జీ దారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించి, గ్రీవెన్స్ పోర్టర్ లో అప్లోడ్ చేసి ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. అలా క్లియర్ చేసినప్పుడు మాత్రమే పోర్టల్ లో పెండింగ్ లేకుండా ఉంటుందని లేకుంటే పదే పదే అప్లికేషన్ రిపీట్ అవుతుందని తెలియజేశారు. గ్రీవెన్స్ లో ఇచ్చే అర్జీలు పూర్తిగా పరిశీలించి సంబంధిత శాఖకు పంపే విధంగా చూడాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని,అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీఖఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తుందని ఐవిఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తీసుకుంటుందని, ప్రజల యొక్క ఫిర్యాదులు పరిష్కరించి వారి యొక్క సంతృప్తి స్థాయిలు పెంచాలని, ఈ ప్రక్రియలో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఏ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయో ఆ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఉన్నటువంటి ఫిర్యాదుదారులు లతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సమస్య ఎందుకు పరిష్కారం కాదో బాధ్యతగా ఫిర్యాదు దారుణకు వివరించాలన్నారు. ప్రత్యేకంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించేటప్పుడు ఖచ్చితంగా ఫిర్యాదు దారుని భూ రికార్డులను తనిఖీ చేయాలని, ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో క్రోడీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పిర్యాధుదారునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలని, ఫిర్యాదును ముగించుటలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ రోజు స్వీకరించిన ఫిర్యాదులు రెవిన్యూ, విద్యుత్ , పౌర సరఫరాలు , ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, పిఆర్ ఇంజనీరింగ్,ఎస్ ఏం ఐ, ఆర్ ఓ ఎఫ్ ఆర్,పెన్షన్, రోడ్లు భవనాల, వైద్య శాఖలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. హుకుంపేట, అరకు, అనంతగిరి జి.మాడుగుల,చింతపల్లి, కొయ్యూరు, జి కె వీధి, అనంతగిరి మండలలోని వివిధ గ్రామంలో సిసి రోడ్లు, కాలువలు, త్రాగునీటి, కమ్యూనిటీ బిల్డింగ్, కరంట్ సౌకర్యం కల్పించాలని అర్జీదారులు అర్జలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ , జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, డిఆర్డిఏ పిడి వి. మురళి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి . కృష్ణ మూర్తి నాయక్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్, ఆర్ బ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, పలువురు తాహాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యవర్గ ఎన్నికలు

**ఎలమంచిలి,ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు ఎలమంచిలి శ్రీ సత్య కాంప్లెక్స్ లో శుక్రవారం నాడు ఒలింపిక్స్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ సూర్యనారాయణ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి జి.పవన్,ఏ.పీ.ఎఫ్.ఏ కోఆర్డినేటర్ శ్రీ నీలాద్రి సమక్షంలో ఎన్నికలు నిర్వహిం చారు. జిల్లా గౌరవ ఛైర్మన్‌గా లాలం చందు, అధ్యక్షుడిగా గణేష్, వైస్ ప్రెసిడెంట్ గా చల్లా సుస్మిత, కార్యదర్శిగా బోదెపు భవాని, సంయుక్త కార్యదర్శి గా రుద్రపంతి నరేష్, కోశాధికారిగా మోహన్ రావు, సభ్యులుగా జి.భాగ్యరేఖ,కె.శేషగిరి ,ఆర్.నరేంద్ర తోపాటు కో ఆప్షన్ సభ్యులుగా బోదెపు రామ కృష్ణ , ఏ.బి.ఎల్.రాజు,పిల్లా రాము నేషనల్ స్పోర్ట్స్ కోటా ద్వారా ఎన్నుకున్నారు. దీనికి ఎన్.సత్య న్నారాయణ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు .ఎన్నికల అనంతరం సుస్మిత క్రీడాకారులకు షూస్ మరియు డ్రెస్సెస్ ఇవ్వడం జరిగింది.

## ఎట్టకేలకు పెనుగొల్లు గ్రోయిన్ పనులు ప్రారంభం



**ఎస్. రాయవరం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఎస్ రాయవరం మండలం ధర్మవరం సమీపంలోని వరాహ నదిలో పెనుగొల్లు గ్రోయిన్ మరమత్తు పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. సుమారు ఆరు సంవత్సరాల కిందట ధర్మవరం వద్ద వరాహ నదిలోని గ్రోయిన్ తో పాటు ఆనకట్టకుగండి పడింది.దీంతో వరహానది దిగువప్రాంతంలో ని కిందగ్రామాల రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు.ప్రతి ఏటా రైతులు సాగునీరుకోసం తాత్కాలికంగా ఇసుకబస్తాలుతో అడ్డుకట్ట వేసుకునేవారు. ఇటీవల రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితగ్రోయిన్ నిర్మాణ పనులుకు రూ.90 లక్షలకు పైగా నిధులు మంజూరు చేయించడంతో ఇరిగేషన్ పనులను ప్రారంభించారు. శుక్రవారం గ్రోయిన్ ను డిఇ సురేష్ కుమార్, ఎఇ భాను పరిశీలించారు.

### ఈనెల 16,17 తేదీల్లో
### విశాఖపట్నంలో అసెంబ్లీ పిటిషన్ల కమిటీ పర్యటన

**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** ఈనెల 16,17 తేదీల్లో విశాఖ జిల్లాలో అసెంబ్లీ పిటిషన్ల కమిటీ పర్యటన చెయ్యనున్నది.ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ఈనెల 16,17న విశాఖపట్నంలో పర్యటించనుందని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సెక్రటరి జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలియ జేశారు.వాస్తవానికి ఈకమిటీ ఈనెల 7,8 తేదీల్లో విశాఖలో పర్యటించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన ఈనెల 16,17 తేదీల్లో జరగనుందని ఆయన తెలియజేశారు.

# సత్యనారాయణపురం ఎన్టీఆర్ నగర్ టిడ్కో కాలనీ లలో మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యత

**- కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కరానికి ప్రాధాన్యత**
**- రీ-సర్వే అర్జీలపై,భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించం**
**- అనారోగ్యానికి గురైన టీడీపీ శ్రేణులు నుండి సీఎం సహాయ నిది దరఖాస్తులు స్వీకరణ**
**- రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ**



**అనకాపల్లి ప్రతినిధి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ లో ఏపీయూఎఫ్ డిసి ఛైర్మెన్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ కు వివిధ సమస్య లపై టిడిపి శ్రేణులు, ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ,మంత్రి నారా లోకేష్ , టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జుల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలో పలు గ్రామాలలో సామాజిక భవనాలను నిర్మించాలని వారిని కోరగా మాజీ మంత్రి, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ , పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ సహకారంతో కృషి చేస్తామని అన్నారు. అంతేకాకుండా అనకాపల్లి మండలంలోని పలు గ్రామాలలో రోడ్లు,కాలువలు నిర్మించాలని కోరారు.కశింకోట మండలంలోని గ్రామంలో ఇళ్లపై విద్యుత్ తీగలు ఉన్నాయని తొలగించాలని కోరగా ఆర్ఇసిఎస్ అధికారులతో ఆయన మాట్లా డారు. అనకాపల్లి మండలంలో పలు గ్రామాలలో వాటర్ సమస్య పై, వాటర్ ట్యాంక్ సమస్యలపై పరిష్కరిం చాలని కోరారు. అంతేకాకుండా అనకాపల్లి మండలంలోని గ్రామాలలో హై మాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలనీ గ్రామ టీడీపీ నాయకులు కోరగా ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు.పాస్ పుస్తకాల కోసం అనకాపల్లి మండలానికి చెందిన రైతులు వారికి పిర్యాదు చేయగా తహశీల్దార్ తో మాట్లాడి వెంటనే పాస్ పుస్తకాలను మంజూరు చేయాలనీ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశం తో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారని ఈ సమస్యలన్నిటిని కంప్యూటర్లో పొందుపరిచి సంబంధిత అధికారులకు పంపి పరిష్కారం అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ళ సురేంద్ర ,క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు,పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలి..ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్)ను పునరుద్ధరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు కె.రమేష్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని విక్టోరియా ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వము 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేసి, 36 శాతం ఐఆర్ మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న డిఏలు, పెన్షన్లను విడుదల చేయాలన్నారు. అలాగే 11వ పిఆర్‌సి నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులకు పూర్తి జీతం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో యూనియన్ నేతలు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి : తిప్పల దేవన్ రెడ్డి



**కంచరపాలెం , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల వైజాగ్ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ వేదిక చైర్మన్ ఎం జగ్గు నాయిడు ఆధ్వర్యములో స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకముగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం కి 1838వ రోజుకు చేరుకుంది. నిరహార దీక్షకు సంఘీభావంగా తిప్పల దేవన్ రెడ్డి, తన అనుచరులతో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయిస్తే లాభాల బాట పడుతుందని తెలిపారు. ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు అని, దానిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. దీక్షలో వైసీపీ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## వేసవిలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం : జిల్లా ఎన్.సి.డి అధికారి డా. జగన్



**పార్వతీపురం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 :** వేసవి కాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రతలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. వాతావరణ మార్పులు మానవుని ఆరోగ్యం కార్యక్రమంలో బాగంగా బాలగుడబ గ్రామంలో ఉపాధిహామీ వేతనదారులకు శుక్రవారం వైద్య సిబ్బందితో కలసి వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో వాతావరణంలో ఉష్ణగ్రతలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల శరీరం నీటిశాతశీ ఎక్కువగా కోల్పోతామని, దాహంతో నిమిత్తం లేకుండా నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ మొదలగు ద్రావణాలను తరచుగా తీసుకోవాలన్నారు. లేకపోతే డీహైడ్రేషన్, ఇంకా ఆలస్యం చేస్తే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. వదులుగా, లేత రంగులో ఉండే దుస్తులు ధరించాలని, సూర్యరశ్మి నేరుగా తగలకుండా గొడుగు, తలపాగా,టోపీ,టవల్ వాడాలన్నారు. ఎక్కడకు వెళ్లినా వెంట త్రాగునీరు ఉంచుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారీ, వినియోగించు విధానాన్ని అక్కడ చేసి చూపిస్తూ వివరించారు. ఒకవేళ డీహైడ్రేషన్ , వడదెబ్బ కు గురైతే ప్రాథమిక ప్రక్రియపై అక్కడ వారిచే డెమో ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం అందరికీ వైద్య సిబ్బంది ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వైద్య సిబ్బంది ఎప్పటికపుడు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ అప్రమత్తం చేయాలన్నారు. ఓ.ఆర్.ఎస్ గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య పరంగా ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వైద్య సిబ్బంది వెంటనే స్పందించి తగు చికిత్స అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్. డబ్ల్యూసి సీహెచ్ఓ సిహెచ్. జగదీష్, ఏఎన్ఎం ఎమ్.స్వాతిముత్యం, ఎన్ఆర్ ఈజిఎస్ సిబ్బంది కె.తాతబాబు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలాలకు చేరినపాఠశాల భవనాలను గుర్తించండి : ఎస్ఎస్ఏపీడి స్వామినాయుడు



**అరకులోయ , ఏప్రిల్ 10 (మనసు లో మాట) :** అరకులోయ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, డుంబ్రిగూడ, అనంతగిరి మండలాలకు చెందిన శిథిలాలకు చేరిన పాఠశాల భవనాలను గుర్తించి నివేదిక తయారుచేసి సమర్పించాలని పాడేరు సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి స్వామి నాయుడు తెలిపారు. అరకులోయ రవ్వలగూడ టి డబ్ల్యూ ఏ పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో శిథిలాలకు చేరిన పాఠశాల భవనాల పునర్నిర్మాణం పై ఆదేశాలలో భాగంగా శుక్రవారం మూడు మండలాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు (1,2) మరియు గిరిజన సంక్షేమ శాఖ ఏ టి డబ్ల్యూ, ఆయా స్కూల్ కాంప్లెక్స్ కు చెందిన సీఆర్పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయం అధికారులకు ఎస్ ఎస్ఎపిడి స్వామి నాయుడు ఆదేశించారు. శిథిలాలకు చేరిన పాఠశాల భవనాలను ఆయామండలాలకు చెందిన సంబంధిత అధికారులు పర్యవేక్షించి ఖచ్చితంగా శిథిలాల చేరినభవనాలను గుర్తించినివేదికసమర్పించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అరకులోయ, అనంతగిరి, దుంబిగూడ మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు (1,2) ఏ టి డబ్ల్యూ ఓ లు మూడు మండలాలకు చెందిన సీఆర్పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు - పక్కా ప్రణాళికతో దొంగతనాలను అరికట్టాలి : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**- బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**
**- పోలీసు స్టేషన్ ను తనిఖీ చేస్తున్న ఎస్పీ**
**- సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ**



**బుచ్చియ్యపేట , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును, కేసుల ప్రగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ఆయన వెంట అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడొద్దని, ఆస్తి దొంగతనాలు జరగకుండా పక్కా ప్రణాళికతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి, పగలు సమయాల్లోను బీట్లను మరింత పటిష్ఠం చేయాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లను ప్రతి వారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సమాజంలో చైతన్యం తేవడానికి రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, మహిళలకు, బాలబాలికలకు వారి రక్షణకు సంబంధించిన చట్టాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీసు అధికారులు తరచుగా గ్రామాలను సందర్శించాలని, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. వారు అందించే సమాచారంపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులను ప్రోత్సహించాలని, స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను, సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన, విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవయే పరమావధిగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్టానిక ఎస్సై ఏ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిపై

# డిప్యూటీ సీఎం పవన్ కు వినతి

**వినతిపత్రం సమర్పించిన జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీశ్ కుమార్**

**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసు లో మాట) :** ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిపై జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీశ్ కుమార్ ఇటీవల విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రధాన సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు .2008-09 నుండి ప్రభుత్వం నుంచి రూ. 30.02 కోట్ల గ్రాంట్లు పెండింగ్ పెట్టినట్లు వినతి పత్రం ద్వారా తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి రూ. 200 కోట్లుం, గ్రామ పంచాయతీల నుంచి రూ. 24 కోట్లు, మున్సిపాలిటీల నుంచి రూ. 73 లక్షల గ్రంథాలయ పన్ను బకాయిలు ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాల సిబ్బంది వేతనాలు, పెన్షన్ల చెల్లింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు .జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సొంత



భవనం లేదని ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగింపు జరుగుతుందని తెలిపారు. నూతన భవన్ నిర్మాణానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని దీన్ని పరిశీలించి భవన నిర్మాణానికి వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న శాఖ గ్రంథాలయాలకు 132 మంజూరైన పోస్టులలో 87 ఖాళీ ఉన్నాయని తెలిపారు. కేవలం 45 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని తెలిపారు. సిబ్బంది లేనిచో గ్రంథాలయాలు మనుగడ కష్టమన్నారు. దీంతోపాటు ఉప ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు వినిపించారు. మన్య ప్రాంత మండలాల్లో 10 అత్యాధునిక డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు,ఉత్తరాంధ్రలో జాతీయ స్థాయి తెలుగు డిజిటల్ లైబ్రరీ నిర్మాణం, ప్రతి గ్రామ పంచాయతీలో, విశాఖ నగరంలోని ప్రతి వార్డులో ఒక గ్రంథాలయం ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఉప ముఖ్యమంత్రి వినతిపత్రంపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. పెండింగ్ బకాయిల విడుదల, గ్రంథాలయాల ఆధునీకరణకు ప్రభుత్వ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.మన్య ప్రాంతాల్లో డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు.

## తారువ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిడిఓ



**దేవరావల్లి , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** మండలంలోని తారువ గ్రామ పంచాయతీని డిడిఓ మండల స్పెషల్ ఆఫీసర్ మంజుల వాణి శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ చేశారు. సచివాలయం సందర్శించే సమయంలో కొంతమంది సిబ్బంది అందుబాటులో లేరు. ఈ కేవైఎస్ సర్వే వెనకబడి ఉన్నది దానిపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేయడంతో రికార్డులు కూడా సరిగా రాయలేదని వెటర్నరీ రికార్డు, అగ్రికల్చర్ రికార్డు నిర్వహణ సిబ్బందిపై డిడిఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది సిబ్బంది చెప్పకుండా గైర్హాజర్ అవుతున్నారు. పంచాయతీ కార్యదర్శికి తెలియకుండా ఎవరైనా గైర్హాజర్ అయినట్లయితే వారిపై తగు చర్య తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. సిబ్బంది బయటకు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో తప్పనిసరిగా సంతకాలు చేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర కుమార్, చిననందిపల్లి కార్యదర్శి సరోజిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పై అవగాహన కార్యక్రమం



**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** విశాఖపట్నం జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ మరియు డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం మరియు మాన్యువల్ స్కావెంజర్ నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలను నివారించడంలో కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ ఘటనలు జరగకముందే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేలా అవగాహన కల్పించాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపినా లేదా అత్యాచారాలకు పాల్పడినా కఠిన శిక్షలు తప్పవని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. భూ వివాదాలు, అసైన్డ్ భూముల సమస్యలు సివిల్ కోర్టుల పరిధిలోకి వస్తాయని, పోలీసులు వాటిలో జోక్యం చేసుకోరని స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, విక్టిమ్స్‌కు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం, సకాలంలో ఆర్థిక సహాయం మరియు పునరావాసం కల్పించడంలో రెవెన్యూ శాఖ వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ కె. రామారావు మాట్లాడుతూ, పౌర హక్కుల చట్టం నుండి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం వరకు ఉన్న వివిధ నిబంధనలను వివరించి, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న హక్కులు, రక్షణలను వివరించారు. కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాధితుల సమస్యలను యంత్రాంగానికి త్వరితగతిన చేరవేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతి, మాజీ పీపీ ఎస్.ఎస్.ఎస్. వాసు కేసుల విచారణలో ఎదురయ్యే సాంకేతిక అంశాలను వివరించారు.

## మూడుసార్లు గుండె ఆగినా మహిళకు ప్రాణం పోసిన కిమ్స్ వైద్యులు

- అరుదైన వైద్య ప్రక్రియతో ప్రాణాలు దక్కించుకున్న మహిళ
- వెంట్రిక్యులర్ టాకీకార్డియా, వీఎఫ్, మూత్రపిండాల వైఫల్యం
- కుచించిన ఊపిరితిత్తులు
- మల్టీస్పెషాలిటీ, ఐసీయూ నిపుణుల అప్రమత్తతతో సాధ్యమైన వైద్య ప్రక్రియ



**విశాఖ సిటీ , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన మహిళకు వరుసగా మూడుసార్లు గుండె ఆగినా, సమయానికి అందించిన అత్యవసర చికిత్స, ఐసీయూ నిపుణుల అప్రమత్తత, మల్టీ స్పెషాలిటీ వైద్యుల సమన్వయంతో ప్రాణాలు కాపాడిన అరుదైన ఘటన విశాఖపట్నం సీతమ్మధార కిమ్స్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఐసియు చీఫ్ డాక్టర్ ఐ.రామకృష్ణ, ఫిజిషియన్ డా. బి.వి.ఎన్ రావు వెల్లడించారు. విశాఖపట్టణానికి చెందిన ఓ 62 ఏళ్ళ డయాబెటిస్ తో బాధపడుతూ, శ్వాస తీసు కోవడంలో ఇబ్బంది, నల్లటి మల విసర్జన, ఆహారం తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో జనవరి నెల 21వ తేదీన కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధారలో చేరింది.హా ఆస్పత్రికి వచ్చేసరికి ఆమె షాక్‌లో ఉండటంతో నోరాడ్రినలిన్ సపోర్ట్ అవసరమైంది. పరీక్షల్లో హిమోగ్లోబిన్ 6.4 గ్రాములు, క్రియాటినిన్ 3.2గా నమోదయ్యాయి. ట్రోపోనిన్ 0.4గా ఉండగా, ఆరు గంటల తర్వాత కూడా అదే స్థాయిలో కొనసాగింది. ఎన్‌టి-ప్రోబీఎన్‌పీ 30 వేలకుపైగా ఉండగా, 2డీ ఎకో పరీక్షలో గుండె కండరాల కదలికలో లోపాలు, స్వల్ప ఎల్వీ డిస్‌ఫంక్షన్ (ఈఎఫ్ సుమారు 47 శాతం) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 48 గంటలపాటు పరీక్షించి చికిత్సనందించిన తర్వాత బిపి అదుపులోకి వచ్చింది. మూత్ర విసర్జన మెరుగుపడటం వంటి లక్షణాలు కనిపించడంతో సమస్య మూలాన్ని గుర్తించేందుకు ఎండోస్కోపీ నిర్వహించారు. అయితే పరీక్ష జరుగుతున్న సమయంలోనే ఆమెకు వెంట్రిక్యులర్ టాకీకార్డియా (వీటీ) రావడంతో ఆకస్మికంగా గుండె ఆగిపోయింది. సీపీఆర్, ఎలక్ట్రిక్ షాక్ సహాయంతో వైద్యులు ఆమెను కాపాడం జరిగింది.అక్కడితో ప్రమాదం ముగియలేదు. ఐసీయూకు తరలించిన తర్వాత మరోసారి గుండె ఆగిపోవడంతో మళ్లీ అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. అనంతరం రెండు రోజుల తర్వాత మూడోసారి కార్డియాక్ అరెస్ట్ సంభవించగా, మరోసారి షాక్ చికిత్సతో విజయవంతంగా కాపాడారు. ఇంతటి ప్రాణాపాయ పరిస్థితులు ఎదురైనా ఆమె స్పృహలో ఉండటం, వైద్యుల ఆదేశాలకు స్పందించడం వైద్య బృందానికే ఆశ్చర్యం కలిగించింది. అయితే ఐసీయూ ప్రయాణం అక్కడితో ముగియలేదు. దీర్ఘకాలం వెంటిలేటర్ సపోర్ట్ అవసరమైంది. కిడ్నీ పనితీరు దెబ్బతినడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. ఎడమ ఊపిరితిత్తి కుంచించుకుపోవడం మరో సవాలుగా మారింది. చివరకు ట్రాకియోస్టమీ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ట్రాకియోస్టమీ అనంతరం ఆమెకు శ్వాసలో సౌలభ్యం పెరిగి, వెంటిలేటర్ నుంచి తొలగించాం. వెంటిలేటర్ మీద ఉన్న రోగిని సొంతగా ఎటువంటి సహాయం లేకున్నా శ్వాస తీసుకునే స్థితికి తీసుకొని రావటం, ఐసీయు డాక్టరుకు గట్టి సవాలతో కూడుకున్న విషయం. ఈ కేసులో అది ఇంకా చిక్కుముడితో కూడుకున్న పని. ప్రతీ రోజూ వెంటిలేటర్ నుంచి తీసే ప్రయత్నం చేస్తూ, ఊపిరితిత్తులకు సంబంధించిన కండరాల వ్యాయామంక్రమం తప్పకుండా చేయించటం, ఇన్ఫెక్షన్ బారినుండి కాపాడటం జరిగింది. ఇంతటి పోరాటం చేసిన తర్వాత పేషెంట్ సొంతగా గాలి తీసుకోవడం ప్రారంభించడంతో, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని, డీకాన్యులేషన్ చేసారు. అది చేసిన తర్వాత ఆమె ఆరోగ్యం మరింత మెరుగుపడిన తర్వాత డిశ్చార్జ్ చేశాం. ఎంతో సహనంతో, ఎన్ని అవాంతరాలు వచ్చినా, చివరి వరకు పట్టు విడవకుండా, ప్రతీ ఒక్క డాక్టరు పరీక్షించి, కలిసికట్టుగా పోరాడి అంతిమంగా విజయం సాధించారు. ఈ చికిత్సలో కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. మహేష్, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. చలపతి రావు, డా. శ్రీనివాస్, నెఫ్రాలజిస్ట్ డా. ఆర్.కె. మహేష్, డా. చరణ్, పల్మోనాలజిస్ట్ డా. భరత్, ఈఎన్‌టీ సర్జన్ డా. దిలీప్, న్యూరాలజిస్ట్ డా. రోహిత్, ఐసీయూ వైద్యులు డా. గంగాధర్, డా. కౌసల్య, డా. రమ్య, డా. మోహన్ సాయి, అనస్థీషియా విభాగాల వైద్యులు సమిష్టిగా కృషి చేశారని తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై నిరసన విరమణ..అధికారుల హెచ్చరికలతో పనులు నిలిపివేత

**కొయ్యూరు , ఏప్రిల్ 10 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామంలో గ్రామ కంఠం భూమిలో గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై గిరిజన యువకుడు పాటి చంద్రశేఖర్ చేపట్టిన శాంతియుత నిరసన దీక్ష ముగిసింది.గ్రామ కంఠం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చంద్రశేఖర్ కొయ్యూరు తాహశీల్దార్ కార్యాలయం ముందు రెండు రోజుల పాటు టెంట్ వేసి నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మార్వో మురళీబాబు ముందుగా గిరిజనేతరులకు నోటీసులు జారీ చేసి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించినప్పటికీ, వారు వాటిని పట్టించుకోకుండా పనులు కొనసాగించారు.దీంతో చంద్రశేఖర్ మరోసారి ఎమ్మార్వో దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా, అధికారులు స్పందించకపోవడంతో చంద్రశేఖర్ నిరసనకు దిగారు. అనంతరం ఎమ్మార్వో మళ్లీ స్పందించి రత్నంపేటకు ఆర్ఐ రాజన్నదొరను పంపించి, అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపించి గిరిజనేతరులకు మరోసారి హెచ్చరికలు జారీ చేయించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సరైన ఆధారాలు ఉంటే చూపించాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని స్పష్టం చేశారు. దీనిపై గిరిజనేతరులు కూడా అధికారులకు హామీ పత్రం అందజేస్తూ, నోటీసులను అతిక్రమిస్తే తామే బాధ్యత వహిస్తామని గిరిజనేతరులు రాతపూర్వకంగా తెలిపారు.ఈ పరిణామాల నేపథ్యంలో అధికారులు స్పందించి నిర్మాణాలు నిలిపివేయించడంతో తాను చేపట్టిన శాంతియుత నిరసన



దీక్షను విరమించుకుంటున్నానని చంద్రశేఖర్ వెల్లడించారు.అనంతరం గిరిజన సంఘం నాయకుడు నర్సి పాపారావు మాస్టర్ చేతుల మీదుగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.అధికారులు భవిష్యత్తులో నిర్లక్ష్యం వహిస్తే ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరాహార దీక్షకు కూడా వెనుకాడనని చంద్రశేఖర్ హెచ్చరించారు. తనకు మద్దతుగా నిలిచిన ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులకు, యువతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో హక్కులు, చట్టాలను కాపాడుకోవాలంటే గిరిజనులే ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.